ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 13 నవంబరు 2025 | 5





సొంతిల్లు.. సంతోషం

- జిల్లాలో 8,773 ఇళ్లలో గృహ ప్రవేశాలు
- ఎమ్మెల్యేలు, అధికారుల సమక్షంలో వేడుక
- పేదల సొంతింటి కల సాకారం

రాజమహేంద్రవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా పడిన అడుగు సామూహిక గృహ ప్రవేశాల రూపంలో బుధవారం నిజమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మొండి గోడలతో అసంపూర్తిగా నిలిచిన ఇళ్లతో లబ్ధిదారుల కళ్లల్లో ఆవేదన నిండిపోతే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో పూర్తిచేసిన ఇళ్లలో గృహ ప్రవేశాలతో అందరి కళ్లలో సంతోషం నెలకొంది. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పూర్తిచేసిన ఇళ్లలోకి ఎమ్మెల్యేలు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులు ఆనందంతో తొలి అడుగు పెట్టారు. కొందరికి గృహాల మంజూరు, అనుమతి పత్రాలను కూడా అందజేశారు. నిడదవోలులో మంత్రి దుర్గేష్ గృహ నిర్మాణ అనుమతి పత్రాలను అందజేశారు. ప్రజలందరికీ ఇళ్ల నిర్మాణం చేయాలన్న సంకల్పంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం 2.0ను సీఎం చంద్రబాబు శ్రీసత్యసాయి జిల్లాలో ప్రారంభించారన్నారు. ఆయన ఆదేశాలతో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు సామూహిక గృహ ప్రవేశాల్లో పాల్గొన్నారని చెప్పారు. వైసీపీ హయాంలో సెంటు స్థలం ఇస్తామని జగన్ చెప్పారని, అయితే ఆ స్థలం ఎటూ సరిపోదని భావించి కూటమి ప్రభుత్వం అర్బన్‌లో రెండు సెట్లు, గ్రామీణంలో మూడు సెంట్ల స్థలాన్ని ఇచ్చిందన్నారు. తద్వారా పేదలకు విశాలమైన సొంతింటిలో నివసించే అవకాశాన్ని సీఎం చంద్రబాబు కల్పించారన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 1170 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కడియం నియోజకవర్గంలో 375 ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేశామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. లబ్ధిదారులకు తాళాలు అందజేసి గృహ ప్రవేశాలు చేయించారు. రాజమహేంద్రవరంలోని 46వ వార్డులో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. నగరంలో 465 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే చెప్పారు. లబ్ధిదారులకు ఉచిత ఇసుక పథకం కింద ఒక్కో ఇంటికి 20 టన్నుల ఇసుకను అందజేయడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణ సహాయాన్ని గతంకంటే ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీజీటీ వర్గాలకు రూ.లక్ష అదనంగా ఇస్తున్నామన్నారు. దీంతో నగరంలోని 3097 మంది లబ్ధిదారుల్లో 747 మందికి అదనంగా లబ్ధి చేకూరిందని తెలిపారు. కొవ్వూరు పట్టణం 1వ వార్డు శ్రీరామకాలనీలో గృహ ప్రవేశ పండుగలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రతి పేద వాడికి కూడు, గూడు, గుడ్డ అందించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పథకాలకు రూపకల్పన చేస్తున్నారని చెప్పారు. కొవ్వూరు అర్బన్ పరిధిలో 2826 ఇళ్ల నిర్మాణానికి రూ.40కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం గృహ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం పోతవరం గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు పెదపాటి వెంకమ్మకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఇంటి తాళం అందజేశారు. ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. అనపర్తి నియోజకవర్గం బిక్కవోలులో బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో గోలి వెంకటరత్నం నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి పేర్కొన్నారు.





గోకవరం మండలం కామరాజుపేటలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ. పక్కన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ కీర్తి చేకూరి.. మరో నివాసంలో లబ్ధిదారులకు దుస్తులు బహుకరిస్తున్న దృశ్యం

'నిరుపేదలకు సొంతిల్లు సమకూర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం'

కామరాజుపేటలో గృహాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా కలెక్టర్

గోకవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇల్లులేని నిరుపేదలకు సొంతిల్లు సమకూర్చి వారి కలలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. గోకవరం మండలం కామరాజుపేట గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ 2.0లో భాగంగా నిర్మించిన రెండు గృహాలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ప్రతీ పేదవానికి సొంతిల్లు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గత 17 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు నిర్వహించడం ప్రభుత్వ సంకల్ప బలానికి నిదర్శనమన్నారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష చేస్తున్నారన్నారు. పీఎం ఆవాస్ యోజన 2.0 ద్వారా ఇంకా పూర్తి ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతను అందిస్తాయన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో జలజీవన్ మిషన్ కింద కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించినట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ అభ్యర్థన మేరకు జాతీయ రహదారులపై ప్రమాదాలకు గురైన బాధితులకు తక్షణం వైద్యం అందించి వారిని రక్షించేందుకు ప్రధాన కూడళ్లల్లో ట్రామాకేర్ సెంటర్‌లను ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 8,773 మంది లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకొని బుధవారం గృహ ప్రవేశాలు చేసుకుంటున్నారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన్- అర్బన్‌లో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీ పరిధిలో 800 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. యూనిట్‌కు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నందున లబ్ధిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, సర్పంచ్ అడపా వెంకట్రావు పాల్గొన్నారు.

దశ తిరిగినట్టే!

- కాకినాడలో ఏంఎంజీ మెటల్ కంపెనీ భారీ పెట్టుబడి.. రూ.44 వేల కోట్లతో అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్ ఏర్పాటు
- కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులోని సూర్యారావుపేటలో నిర్మాణం.. పలు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు 6

రాజమహేంద్రి టీడీపీ కంచుకోట

జిల్లాలో పలుచోట్ల క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం 8

'ఆంధ్రజ్యోతి' విజిట్..

గందరగోళం



గోకవరంలో ఓ సచివాలయం వద్ద సిబ్బంది సర్వే నిమిత్తం ఫీల్డ్‌లో ఉన్నారు, గమనించగలరు అని బోర్డు పెట్టిన దృశ్యం

- సచివాలయాల్లో ఇష్టానుసారంగా అధికారుల పనుల అప్పగింత
- అందుబాటులో ఉండని ఉద్యోగులు
- చేయాల్సింది ఒకటి.. చేసేది ఇంకొకటి
- సర్వేలతో సరి.. అమలుకాని క్లస్టర్ విధానం
- డిజిటల్ అసిస్టెంట్లపైనే పనిభారం
- సక్రమంగా వినియోగించుకుంటే విజన్ యూనిట్లుగా మంచి ఫలితాలు

రాజమహేంద్రవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు గందరగోళంగా మారాయి. చాలాచోట్ల కళ తప్పాయి. కొందరు సచివాలయంలో అందుబాటులో ఉండని పరిస్థితి ఉంది. గతంలో నిర్ణయించిన జాబ్ చార్ట్ కూడా సక్రమంగా అమలు కావడం లేదు. ఈ ఉద్యోగులను కచ్చితంగా విజన్ కోసం ఉపయోగించుకుంటే మంచి ఫలితాలే ఉంటాయి. అందరూ ఉన్నత విద్యావంతులే. మొదట్లో ఒక్కో సచివాలయానికి 11 మంది ఉద్యోగులు వరకూ ఉండేవారు. తాజాగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈ సచివాలయాలను విజన్ యూనిట్లుగా మార్చే ప్రయత్నంలో ఉంది. త్వరలో సచివాలయాల పేర్లు కూడా మారనున్నాయి. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులను వినియోగించుకోవడంలోనూ సరైన స్పష్టత ఇంతవరకూ కనిపించలేదు. పైగా వారికి ప్రమోషన్ల విధానం కూడా సరిగ్గా లేదు. ఇటీవల పంచాయతీ గ్రేడ్‌లు నిర్ణయించినపుడు ఏ గ్రేడ్‌ను ఏ గ్రేడ్‌లోకి మార్చారో చెప్పలేదు. గ్రేడ్-5 ఉద్యోగులు సెక్రటరీలు ప్రమోషన్ల మీద వెళ్లారు. ప్రస్తుతం ఉద్యోగుల్లో కూడా గందరగోళం ఉంది. ఏ ఉద్యోగిని ఎక్కడ ఎలా పనిచేయిస్తారో అనే విషయంలో కూడా గందరగోళం ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఈ ఉద్యోగులను సక్రమంగా వినియోగించుకోవడం రేషనలైజేషన్ చేయడంతోపాటు క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉద్యోగుల రేషనలైజేషన్ జరిగింది. కానీ క్లస్టర్ విధానాన్ని మ్యాపింగ్ చేశారే తప్ప, ఇంకా పూర్తిగా అమలులోకి తీసుకురాలేదు. జిల్లాలో 512 సచివాలయాలు ఉన్నాయి. వీటిని 218 క్లస్టర్లుగా విభజించారు. జిల్లాలో ప్రస్తుతం 4,278 ఉద్యోగులు పనిచే స్తున్నారు. చాలావరకూ ఖాళీలు ఉన్నాయి. ఎస్ పొజి షన్ అంటే పోస్టింగ్ ఇచ్చిన చోటనే పనిచేసేవారు 3280 ఉన్నారు. నో పొజిషన్ అంటే తాను పనిచేసే ప్రాంతంతోపాటు వేరేచోట కూడా పనిచేసేవారు 998 మంది ఉన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 96 సచివాలయాలు ఉన్నాయి. ఇక్కడ 950మంది ఉద్యోగులు ఉండాలి. ప్రస్తుతం 759 మంది ఉన్నారు. 201 ఖాళీలు ఉన్నాయి. ఇక్కడ క్లస్టర్ విధానం కొంతవరకూ అమలుచేస్తున్నారు. కానీ అది పూర్తి స్థాయిలో అమలులోకి రాలేదు. రాజమహేంద్రవరంలో ఒకేభవనంలో ఎక్కువ సచివాలయాలు పెట్టడం వల్ల అవి ప్రజలకు అందుబాటులో కూడా లేవు. ఇది వైసీపీ నిర్వాకం. ఇక సచివాలయాలలో టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించారు. అధికారుల కథనం ప్రకారం వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, సర్వేయర్‌లో టెక్నికల్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాన్ టెక్నికల్‌గా ఉంటారు. ప్రస్తుతం అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రెండేసి సచివాలయాల్లో పని చేయవలసి ఉంది. పింఛన్ల పంపిణీ, మన మిత్ర సర్వే, కౌసల్య సర్వేలు ఈ ఉద్యోగులే చేస్తున్నారు. కొందరు బీఎల్‌వో డ్యూటీలు కూడా చేస్తున్నారు. వాస్తవానికి జాబ్‌చార్ట్ ప్రకారం పనిచేసే కొందరు ఉద్యోగుల వల్ల విజన్ యూనిట్లుగా మార్చవచ్చు. గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, వార్డుల్లో ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ప్రధాన వర్కు ఉంటుంది. శానిటేషన్, మహిళా పోలీసు, ఏఎన్ఎం చేయవలసిన పనులు కూడా చేయని పరిస్థితి. మహిళా పోలీసులు అంగన్‌వాడీలు, స్కూల్స్ తనిఖీ చేయాలి. ఆయా ప్రాంతాల్లో నేరాలు జరిగినా, బెల్ట్‌షాపులు, వంటివాటిపై నిఘా ఏఎన్ఎంలు చాలా చోట్ల ఆఫీసులకు రావడంలేదు. వాళ్ల ఫీల్డ్‌లో ఉన్నామని చెబుతుంటారు. కానీ శానిటేషన్ సెక్రటరీ ఆయా వార్డులలో శానిటేషన్ మీద కోసం పనిచేయాలి. పట్టణాల్లో శానిటేషన్ సూపర్‌వైజర్లు ఉంటారు. వారికి తోడు శానిటేషన్ సెక్రటరీ కూడా. వీరిని సక్రమంగా వినియోగించుకోవడం అవసరం. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రోడ్లు, భవనాలు వంటి వాటి గురించి చూడాలి. వీరందరినీ ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో వేరే పనులకోసం ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. కొన్నిచోట్ల మహిళా పోలీసులను బీఎల్‌వోలుగా ఉపయోగిస్తున్నారు. వీఆర్‌వోలు ఎక్కడ ఉంటున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి. సచివాలయంలో అడిగితే, తహశీల్దార్ కార్యాలయంలో ఉన్నారంటారు. అక్కడ అడిగితే ఇక్కడ అంటారు. సర్వేయర్లు పూర్తిస్థాయిలో పనిచేయడంలేదు. ఏఎన్ఎంలూ అంతే. ప్లానింగ్, మహిళా పోలీసు, వెల్ఫేర్లకు నిర్దిష్టమైన జాబ్ చార్టర్ కనిపించడం లేదు. అడ్మిన్‌లు మాత్రం టాక్స్ కలెక్టర్, సచివాలయ నిర్వహణ, లైన్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ చూస్తారు. ఈ సెక్రటరీలు నిత్యం ఫీల్డ్‌లోనే ఉన్నట్టు చెబుతున్నారు. ఇలా ఏదో పనికోసం ఫీల్డ్‌లో ఉన్నామని చెప్పడం వల్ల సచివాలయాల్లో ఎవరూ ఉండని పరిస్థితి ఉంది. గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు చాలా వరకూ సచివాలయాల్లో ఉంటారు. పింఛన్ల పంపిణీ రోజు ఎవరూ ఉండరు. మొత్తం మీద సచివాలయ ఉద్యోగులను వేర్వే పనులకే అధికారులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. విజన్ యూనిట్లుగా ఉండాలంటే ఆఫీసులో కొందరు ఉండాలి. గ్రామాలకు సంబంధించిన పనులన్నీ అక్కడ జరుగుతుండాలి. కలెక్టరేట్‌లోనూ, ఇతర డిపార్ట్‌మెంట్లలోనూ డిప్యుటేషన్ల మీద కూడా కొందరు పనిచేస్తున్నారు. ఉద్యోగులపై సరైన ఆజమాయిషీ లేదు. ఏదో పని గడిచిపోతుందనే విధానంలోనే అధికారులు వ్యవహరిస్తుండడంతో, ఉద్యోగులు కూడా అప్పగించిన పనిచేసి చేతులు దులుపుకుంటున్నారు.

డిజిటల్ అసిస్టెంట్లే ప్రధాన ఆధారం

గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ పాత్ర ప్రధానం. పంచాయతీ సెక్రటరీలకు సంబంధించిన బిల్లులు ఇతర వర్కు కూడా వీరే చేస్తుంటారు. ఇంటిపన్నులు, నీటిపన్నులు కట్టించుకోవడంతోపాటు ఈ-సేవ, మీ-సేవ పనులు వీరు చేస్తుంటారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు సంక్షేమ పథకాలు చూస్తారు. బీసీ, ఎస్సీ, కాపు, ఇతర కులాల రుణాలకు దరఖాస్తులు చూస్తుంటారు. ప్రజలకు దగ్గరగా పాలన ఉండాలనే ఈ ఉద్యోగుల సేవలను సక్రమంగా వినియోగించుకోవాలి. ఆయా గ్రామాలు, వార్డుల పరిధిలోని అని విషయాలను వారికి అప్పగించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రచారం, అవగాహన కల్పించడం వంటివి సక్రమంగా జరిగితే ప్రజలకు మేలే.

పింఛన్ల పంపిణీలో మంచి సేవ

సచివాలయ ఉద్యోగులు ప్రతీ నెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మంచి సేవే చేస్తున్నారు. ఉదయాన్నే ఆయా లబ్ధిదార్ల ఇళ్లకు వెళ్లి, పింఛన్లు పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ సర్వేలు కూడా ఈ ఉద్యోగులే చేస్తున్నారు. గ్రామస్థాయి సమాచారం వెంటనే రికార్డు కావడానికి ఈ ఉద్యోగులే కారణం. ఈ వ్యవస్థను విజన్ యూనిట్లుగా వినియోగించుకుంటే ప్రజలకు మరింత చేరువవుతుంది. మహిళా పోలీసులను అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయమన్నారు. కానీ వారికి సరైన అధికారం లేదు. రాజమండ్రిలో ఎస్పీ ఆఫీసులో పనిచేయడానికి, ఎగ్జామ్ సెంటర్ల డ్యూటీ, లీగల్ సర్వీస్ కమిటీ మీటింగ్ ప్రొటెక్షన్, ఐసీడీఎస్ మీటింగ్‌లకు వీరిని వినియోగిస్తున్నారు. కౌసల్యం సర్వే కింద గ్రామాల్లో విద్యావంతులు ఇంటి నుంచే పనిచేసే విధానం వస్తోంది. ఇందుకోసం డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నారు.



రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌లో గుండె వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

జీజీహెచ్‌లో గుండె సంబంధిత వ్యాధులపై స్క్రీనింగ్ క్యాంపు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సుపత్రి(జీజీహెచ్)లో బుధవారం చిన్నారుల గుండె సంబంధిత వ్యాధులపై ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. మొత్తం 61 మంది పిల్లలకు స్క్రీనింగ్ నిర్వహించారు. వీరిలో ఆరుగురికి అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమని తేలిందని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర తెలిపారు. మిగిలిన పిల్లలకు అవసరమైన మందులు తదుపరి వైద్యసలహాలు ఇండో బ్రిటీష్ హాస్పటల్ వారితో ఉచితంగా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ద్వారా గుర్తించిన గుండె సంబంధిత వ్యాధుల చిన్నారులకు విజయవాడ ఇండో బ్రిటీష్ హాస్పటల్ సహకారంతో స్క్రీనింగ్ నిర్వహించామని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల గుండె సమస్యలను ప్రారంభదశలోనే గుర్తించి వైద్యసేవలందిస్తే భవిష్యత్తులో సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఐసీ వైద్యులు డాక్టర్ ఇంద్రజ, చిన్నపిల్లల గుండె నిపుణురాలు డాక్టర్ అనూష, వైద్యులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్య శిక్షణ

- నియోజకవర్గానికో స్కిల్‌హబ్
- మేధో మథనంలో కలెక్టర్ కీర్తి చేకూరి
- హాజరైన వీసీలు

రాజమహేంద్రవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి):విద్యతోపాటు నైపుణ్య శిక్షణ ఉంటే భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకున్నట్టేనని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్రెయిన్ స్టార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగావకాశాల విస్తరణ దిశగా సమగ్ర చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా మేధో మథనం సమావేశాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అకాడమిక్ స్టడీతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కలిపి అమలు చేసినప్పుడే యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్‌హబ్ ఏర్పాటు జరుగుతోందన్నారు. వీటి ద్వారా నిరుద్యోగ యువకు శిక్షణ తరగతులు నిర్వహించి వారిలో నైపుణ్యాన్ని మెరుగుపరుస్తామన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు సాంకేతిక, భాష, అకౌంటింగ్, టూరిజం, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, నర్సరీ మేనేజ్‌మెంట్ వంటి విభిన్న అంశాల్లో తర్ఫీదు ఉంటుందన్నారు. ఆర్‌టీఐహెచ్ ద్వారా ఐదు జిల్లాల యువతకు స్టార్టప్స్ ద్వారా ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ 88 కంపెనీలతో ఎంవోయూలను కుదుర్చుకున్నామని కలెక్టర్ వివరించారు. యువతలో ఉన్న నైపుణ్య లేమిని గుర్తించి ఆ దిశగా శిక్షణ అందిస్తే స్థానికంగా మరిన్ని ఉద్యోగాకావకాశాలు కల్పించవచ్చన్నారు. సీఎస్ఆర్ విధానంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఆయా కార్పొరేట్ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే శిక్షణ పద్ధతులను ప్రారంభించామన్నారు. కొబ్బరి, పూలవ్యర్థాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన, మహిళా సాధికారత, కంప్యూటర్ అకౌంటింగ్, అంగ్లభాష సెంటర్ అభివృద్ధి, ఇండియన్ హెరిటేజ్ వంటి అంశాలను శిక్షణ జాబితాలో చేర్చామన్నారు. కళాశాల స్థాయిలో కూడా పలు అంశాలను ప్రవేశపెడితే విద్యార్థులు ఉపాధి సులభంగా పొందగలుగుతారని చెప్పారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నంనాయుడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, వీసీలు ప్రసన్న, మునిరత్నంనాయుడు



పోల్ వాల్ట్‌లో మేటి క్రీడాకారుడు రవి

విద్యార్థి దశ నుంచే ఆటలపై మక్కువ. అతడిలో ఉన్న నైపుణ్యాన్ని కోచ్ గమనించి శిక్షణ ఇచ్చి పోల్‌వాల్ట్ బరిలో దింపాడు. అరకొరగా ఉన్న సౌకర్యాలను వినియోగించుకుంటూనే జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. పోల్‌వాల్ట్ బరిలో అతను అడుగుపెడితే పతకం ఖాయమనే పేరు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి మరింత ఉన్నత స్థాయి శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిండం తన లక్ష్యమని చెప్తున్నాడు.



- పోల్‌వాల్ట్‌లో సత్తా చాటుతున్న పిఠాపురం క్రీడాకారుడు సాలా రవి
- విద్యార్థి దశ నుంచే పతకాల వేట
- ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో 20 స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం
- సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ పోటీల్లోనూ పతకాలు సాధిస్తానని ధీమా

అడుగు పెడితే పతకమే



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన సాలా రవి పోల్‌వాల్ట్ క్రీడలో రాణిస్తూ పతకాలు పంట పండిస్తున్నాడు. ఇతడికి చిన్ననాటి నుంచే క్రీడలపై మక్కువ అధికం. ఆ సమయంలో చదువుకునే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎలిపే సునీల్‌దేశాయి ఇతనిలో ప్రతిభను గుర్తించి పోల్‌వాల్ట్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేకపోయినా కోచ్ సమకూర్చిన వాటితోనే శిక్షణ పొంది నగరాల్లో అత్యాధునిక క్రీడా మైదానాల్లో శిక్షణ పొందిన వారితో పోటీ పడి పతకాలు సాధించడం ప్రారంభించాడు. ఇతని పేరు ఎంత ఎలా మారుమోగింది అంటే రవి పోల్‌వాల్ట్ బరిలో దిగితే పతకం ఖాయమని ముందే చెప్పే వరకూ. ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఒక వైపు ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూనే పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్నాడు.

బరిలో దిగిన నాటి నుంచీ...

ఉన్నత పాఠశాల స్థాయిలో బరిలో దిగిన నాటి నుంచీ రవి పోల్‌వాల్ట్‌లో తన ప్రతిభ చాటుకుంటూనే వస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటిదాకా 15 స్వర్ణ, 2 రజత, 3 కాంస్య పతకాలు సాధించాడు. అండర్-18, అండర్-20, అండర్-23, యూనివర్సిటీ, అంతర్ యూనివర్సిటీల కేటగిరీల్లో ఏ పోటీ జరిగినా విజేత ఇతడే. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, గుంటూరు నాగార్జున యూనివర్సిటీ, అమలాపురంల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోను, జార్ఖండ్, తమిళనాడు, కేరళ, తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని గుంటూరు నాగార్జున యూనివర్సిటీల్లో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్-పోల్‌వాల్ట్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.





రవిని అభినందిస్తున్న విశ్రాంత అడిషనల్ ఎస్పీ అరిటాకుల శ్రీనివాసరావు, గుంటూరులో జరిగిన అంతర్ యూనివర్శిటీ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన రవి (పాత చిత్రాలు)

ఉద్యోగ వేటలో: పోల్‌వాల్ట్ క్రీడలో 20 పతకాలు సాధించిన క్రీడాకారుడు సాలా రవి ప్రస్తుతం ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. చదువు పూర్తి కావడంతో ఏదైనా ప్రభుత్వరంగ సంస్థ లేదా రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతిభను గుర్తించి ఉద్యోగ అవకాశం కల్పిస్తుందనే ఆశతో ఉన్నాడు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కోచ్ ఎలిపే సునీల్‌దేశాయి ప్రోత్సాహంతో ఇప్పటికీ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నాడు. ఇదే సమయంలో నగరాల్లో ఉన్న పోల్‌వాల్ట్ అత్యాధునిక సౌకర్యాలను పిఠాపురంలో కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిస్తానని ధీమాగా చెప్తున్నాడు రవి. ఇతడి ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ఉద్యోగావకాశం కల్పిస్తే పలువురు క్రీడాకారులకు స్ఫూర్తిగా ఉంటుందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.



ప్రభుత్వం అండగా నిలిస్తే పతకాల పంట పండిస్తాం

ఎలిపే సునీల్ దేశాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు, కోచ్, పిఠాపురం

ప్రభుత్వం అండగా నిలిచి పోల్‌వాల్ట్ సహా అన్ని క్రీడలకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తే మన క్రీడాకారులు పతకాల పంట పండిస్తారు. పిఠాపురం నుంచి ఎంతోమంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారు. పోల్‌వాల్ట్‌లో సాలా రవి మంచి ప్రతిభ కనబరుస్తున్నాడు. ఉన్న సౌకర్యాలతోనే అతడికి శిక్షణ ఇచ్చి, ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీ పడేలా తీర్చిదిద్దాము. ఇలాంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక కోటా కింద ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే బాగుంటుంది. ఇలాంటి వారిని చూసి మరింత మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తయారవుతారు.

అందరూ ఆడుతుంటే ఆసక్తి కలిగింది

సాలా రవి, పోల్‌వాల్ట్ క్రీడాకారుడు, పిఠాపురం



పాఠశాలల్లో చదువుకునే సమయంలో మా సీనియర్లకు మా వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్‌దేశాయి శిక్షణ ఇవ్వడం చూశాను. నాకూ పోల్‌వాల్ట్‌పై ఆసక్తి కలిగింది. ఇతర క్రీడల్లో ప్రావీణ్యం ఉన్నా పారే పోల్ వాల్ట్‌లో కోచ్ సునీల్‌దేశాయి ప్రోత్సహించి శిక్షణ ఇచ్చారు. దీంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటగలిగాను. ఉన్న సౌకర్యాలతోనే 20 పతకాలు సాధించాను. ఇక్కడ పూర్తిస్థాయిలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఉంది.



ఏజెన్సీలో సాగవుతున్న నల్ల ధాన్యం పంట

నల్ల బియ్యం.... ఆరోగ్యకరం

'తూర్పు' మన్యంలో విస్తరిస్తున్న సాగు

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

సాగుకు పెట్టుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆ వ్యయాన్ని రాబట్టుకోవడానికి అధిక దిగుబడులు వైపు అడుగులు వేస్తున్నారు. ఇందుకు రసాయనాలు వినియోగించాల్సి రావడం... అవి తిన్నవారు వ్యాధుల బారిన పడి చివరకు ఆసుపత్రులపాలవుతుండడం చూస్తున్నాం. కాగా ఇటీవల పల్లెలు మొదలుకొని పట్టణాల వరకు సేంద్రియ పంటల వినియోగం వైపు మొగ్గుచూపుతున్నారు. ఆ మేరకు అందుబాటులో వున్న రైతుల వద్ద నేరుగా ఆయా పంటలను కొనుగోలు చేయలేని పక్షంలో ఆన్‌లైన్‌లను ఆశ్రయిస్తున్నారు. సాధారణ సాగు పంటలతో పోల్చితే సేంద్రియ పంటల ధరలు ఎక్కువగా ఉండడం, డిమాండ్ కూడా పెరుగుతుండడంతో రైతులు కూడా సేంద్రియ సాగువైపు ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా నల్ల బియ్యం, బ్రౌన్‌రైస్, దంపుడు బియ్యం విక్రయాలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. వాటి ధరలు కూడా అధికంగా ఉన్నప్పటికీ వినియోగ శాతం రోజురోజుకూ పెరుగుతూ వస్తోందని విక్రయదారులు చెప్తున్నారు.

ఇదిలా వుండగా అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని చట్టి, వీరాపురం, ఎటపాక



మండలంలోని కేఎస్ పురంలో ఈ ఏడాది కొద్దిమంది రైతులు నల్ల ధాన్యం (బియ్యం) సాగు చేస్తున్నారు. చట్టికి చెందిన రవ్వ అంజి, గౌరి, సీతారామయ్య తదితరులు నల్ల ధాన్యాన్ని పండించి సొంతంగా వినియోగించుకుంటున్నారు. ఈ బియ్యం తినడం ద్వారా ఆరోగ్యం కూడా మెరుగుపడుతోందని వారు చెప్తున్నారు. కాగా పంట ఏపుగా పెరగడంతో గాలికి కిందకు పడిపోతోందని, సాధారణ వరి కంటే దిగుబడి తక్కువగా ఉంటోందన్నారు. మార్కెట్లో నల్ల బియ్యం ధర కిలో రూ.200 వరకు ఉంది. నల్ల ధాన్యం వంగడాలను ఆసక్తి గల రైతులకు అందిస్తున్నామని అంజి చెప్పారు.





నల్ల ధాన్యం పండిస్తున్న గౌరి, అంజి

హిందీలో చేతిరాత బైబిల్ ఆవిష్కరణ



రచయిత శాంతకుమారిని అభినందిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి

- కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి దుర్గేష్, మాజీ ఎంపీ ఉండవల్లి
- రచయిత శాంతకుమారికి అభినందన

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగు, ఆంగ్ల భాషల్లో బైబిల్‌ని చేతిరాతతో పూర్తిచేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి తాజాగా హిందీలో కూడా చేతిరాతతో బైబిల్‌ను పూర్తిచేయడం అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక లూథర్ గిరి క్రైస్ట్ చర్చిలో బుధవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయన విచ్చేసి సదరు బైబిల్‌ను ఆవిష్కరించారు. పేపర్ మిల్ ఐఎన్‌టీయూసీ నేతగా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా సుపరిచితుడైన బయ్యా జోసెఫ్ రాజు పుట్టినరోజు సందర్భంగా ఆయన సతీమణి శాంతకుమారి రాసిన హిందీ వెర్షన్ చేతిరాత బైబిల్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. మరో ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జోషి అజాత శత్రువని, ఉండవల్లి, జక్కంపూడి, జోషి కాంబినేషన్‌లో రాజకీయాలు అద్భుతంగా నడిచాయన్నారు. పేపర్‌మిల్ ఉన్నంతకాలం జోషి పేరు వినిపిస్తుందన్నారు.మూడు భాషల్లో బైబిల్‌ని చేతిరాతతో పూర్తిచేయడం ఎక్కడా లేదని,దీనిపై గిన్నీస్ బుక్ రికార్డు కోసం దరఖాస్తు చేయాలని అందుకు అవసరమైన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, జక్కంపూడి విజయలక్ష్మి , సహస్ర, కోలమూరు ప్రభాకరరావు, రెవ జి.విలియమ్స్, డేవిడ్‌కుమార్, ప్రార్థనాకుమార్, శ్రీకాంత్ జేమ్స్, పెర్సి హేరామ్స్, నెల్సన్ ఫ్రాన్సిస్, చక్రవర్తి, ఆనంద్‌కుమార్, డానియల్ బి.రవి, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, పంతం కొండలరావు, టీకే విశ్వేశ్వరరెడ్డి, అశోక్‌కుమార్ జైన్, నక్కా రాజబాబు పాల్గొన్నారు.

దశ తిరిగినట్టే!

- కాకినాడలో ఏఎంజీ మెటల్ కంపెనీ భారీ పెట్టుబడి
- రూ.44వేల కోట్లతో అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్
- కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులోని సూర్యారావుపేటలో నిర్మాణం
- పలు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడకు మరో భారీ పెట్టుబడి వచ్చింది. ఏకంగా రూ.44 వేల కోట్లతో ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు నిర్ణయించింది. కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులోని పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని సూర్యారావుపేటలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. ఈ మేరకు భారీ పెట్టుబడితో ముందుకు వచ్చిన ఈ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించాలని నిర్ణయించింది. ఈమేరకు పరిశ్రమల శాఖ బుధవారం జీవో ఎంఎస్ నెంబరు 201 పేరుతో ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో సూర్యారావుపేటలో స్పెక్ట్రమ్ పవర్ ప్లాంట్ ఉండేది. ఆ తర్వాత దాన్ని విక్రయించేసింది. ఇప్పుడు అందులో ఈ కొత్త పరిశ్రమ రాబోతోంది. ఈ కంపెనీ 800 ఎకరాల్లో స్థాపించి ఏడాదికి ఒక మిలియన్ టన్ను అల్యూమినియం స్మెల్టర్‌ను పూర్తి పర్యావరణ హిత విద్యుత్ ఉపయోగించి ఉత్పత్తి చేయనుంది. ఈ కంపెనీకి తెరవెనుక పూర్తి సహాయ సహకారాలను నెదర్లాండ్స్‌లో ఏర్పాటు చేసిన ఏఎం గ్రీన్ అందించనుంది. కంపెనీ స్థాపనలో భాగంగా ఏఎంజీ సంస్థ భూమి,భూ అభివృద్ధికి రెండు దశల్లో రూ.1800 కోట్లు, భవనాలు, ఇతర సివిల్ పనులకు రెండు దశల్లో రూ.2,950 కోట్లు, ప్లాంట్, ఇతర యంత్రాలకు రెండు దశల్లో రూ.30,300 కోట్లు, ఇంకా ఇతర ఖర్చులు కలిపి మొత్తం తొలిదశ కింద రూ.24,250 కోట్లు, రెండో దశ కింద రూ.19,750 కోట్లు కలిపి మొత్తం రూ.44 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వానికి వివరించింది. తొలి దశలో 0.5 మిలియన్ టన్నులు, రెండో దశలో 0.5 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయనుంది. తద్వారా మొత్తం 3వేల మందికి ఉపాధి కల్పించనున్నట్టు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. ఈ మేరకు పెట్టుబడుల ప్రతిపాదన వివరాలను ఈ సంస్థ ఈ నెల 7న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) ఎదుట ఉంచింది.ఈ నేపథ్యంలో ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు ఈ సంస్థకు సూర్యారావుపేటలో 250 ఎకరాల భూ కేటాయింపునకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే కంపెనీ ఉత్పత్తికి సహకరించడంలో భాగంగా గ్రీన్ కారిడార్ విధానంలో 2,500 మెగావాట్ల విద్యుత్, నీటి అవసరాలు తీర్చే విధంగా 17.2ఎంఎల్‌డీ నీటి సరఫరా చేయనుంది. అలాగే భారీ పరిశ్రమ కేటగిరీలో ఈ కంపెనీని చేర్చి అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు వేగంగా జారీ చేయడం, అలాగే వాటర్ ఫ్రంట్ యాక్సెస్ కింద మల్టీపర్పస్ బార్జి డాక్ నిర్వహణకు అనుమతులు జారీ చేసింది. అంటే ఈ కంపెనీ ఎదురుగా ఉన్న ఉప్పాడ సముద్రం వద్ద ప్రత్యేక బెర్త్ నిర్మించి నేరుగా విదేశాల నుంచి కావలసిన పరికరాలు, యంత్రాలు, ఇతర ఉత్పత్తులు నౌకల్లో తీసుకురానుంది. అలాగే కంపెనీ రెండు దశల్లో పెట్టనున్న రూ.37,150 కోట్ల ఫిక్స్‌డ్ క్యాపిటల్ పెట్టుబడికి సంబంధించి ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ పది సంవత్సరాల పాటు 15శాతం, విద్యుత్ సుంకం నూరు శాతం పాతిక సంవత్సరాల పాటు మినహాయింపు, కారుచౌక ధరకు 25ఏళ్లపాటు నీటి సరఫరా, స్టాంపు డ్యూటీ, భూమార్పిడి, రిజిస్ట్రేషన్ ఫీజులు నూరు శాతం(250ఎకరాల భూ కొనుగోలుపై రూ.28 కోట్లకు మించకుండా) మినహాయింపు ఇస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏం ఉత్పత్తి చేస్తారు..?

అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్ అంటే అల్యూమినియం ఆక్సైడ్ నుంచి విద్యుద్విశ్లేషణ ప్రక్రియ ద్వారా అల్యూమినియాన్ని వెలికితీసే ప్లాంట్. ఈ ప్రక్రియ కోసం ప్లాంట్‌కు భారీగా విద్యుత్ అవసరం. దీన్ని గ్రీన్ ఎనర్జీ కింద చలమశెట్టి అనిల్ కంపెనీ అయిన ఏఎం గ్రీన్ అందిస్తుంది. ఈ ప్లాంట్‌కు బాక్సైట్ ఖనిజం నుంచి తీసిన అల్యూమినియాన్ని ముడి పదార్థంగా ఉపయోగిస్తారు. ఈప్లాంట్ ద్వారా ఉత్ప త్తయ్యే వస్తువులు ఉక్కు, రాగి, జింక్, సీసంకు ప్రత్యామ్నాయంగా వాడతారు. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తయ్యే అల్యూమినియాన్ని ఇం గోట్స్ రూపంలో పోస్తారు. దీన్ని కరిగించి బిల్లెట్స్, వైర్‌రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.

18 ఏళ్ల లెలావాయి రైతుల నిరీక్షణకు ఫలితం

ఎట్టకేలకు పోలవరం నిర్వాసిత రైతులకు వడ్డీతో సహా బ్యాంకు ఖాతాలో జమ

కూనవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లెలావాయి ప్రాంతంలోని భూములున్న పోలవరం నిర్వాసిత రైతుల నిరీక్షణ 18 ఏళ్ల తర్వాత ఫలించింది. వాస్తవానికి ఈ ప్రాంతంలోని భూములకు ఉమ్మడి రాష్ట్రంలో 2007లోనే పరిహారం రావాల్సి ఉంది. అప్పట్లో సీపీఎం పార్టీ పోలవరం ప్రాజెక్టు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చేపట్టింది.ఈ ప్రాంతంలో భూముల సర్వేకు వచ్చిన అధికారులను సీపీఎం నాయకులు గదుల్లో వేసి నిర్బంధించేవారు. అప్పటి నుంచి ఈ భూముల సర్వే నిలిచిపోయింది. మళ్లీ రెండేళ్ల క్రితం సర్వే నిర్వహించి అవార్డు ఎంక్వైయిరీ నిర్వహించినప్పటికీ జగన్ ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వలేదు. అయితే కూటమి అధికారంలోకి రాగానే ఈ భూములకు వడ్డీతో సహా బుధవారం రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. వాస్తవానికి పోలవరం ప్రాజెక్టు కారణంగా భూములకు ఎకరానికి రూ.10.80 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ వడ్డీతో సహా రూ.1,47,178 కలిపి రూ.12,27,178 ఒక ఎకరానికి చెల్లించింది.ఈ లెలావాయి భూముల్లో కూనవరం, టేకులబోరు, భీమవరం గ్రామాలకు చెందిన 46మంది రైతులు ఉండగా 128 ఎకరాల 90 సెంట్లు భూమి ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు మాత్రం ఐఎఫ్‌సీ కోడ్ మారిపోవడంతో వారి బ్యాంకుల్లో డబ్బులు కావడానికి కొంత ఆలస్యం అవుతుంది. చాలా సంవత్సరాల తర్వాత పరిహారం రావడంతో నిర్వాసితులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆర్ఎంసీ ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఉద్యోగోన్నతి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ)లో ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు ప్రొఫెసర్ హోదా కల్పిస్తూ ఆర్ఎంసీ ఈఎన్‌టీ విభాగంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులో నియమించింది. స్పౌజ్, పరిపాలనా కోణంలో ఉద్యోగోన్నతి ఇచ్చినట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జీవోఆర్‌టీ నెం.787లో పేర్కొంది.

జాతీయ స్క్వాష్ పోటీలకు పిఠాపురం విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవో

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడలో జరిగిన అంతర జిల్లాల స్క్వాష్ పోటీల్లో ఇంటర్ బైపీసీ సెకండియర్ విద్యార్థిని బూర వెన్నెల, ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థిని మందేపల్లి తేజస్విని, 8వ తరగతి విద్యార్థిని గుత్తుల మహాలక్ష్మిలు ప్రతిభ చూపగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల్లో జనవరి 3నుంచి 8వ తేది వరకూ డిల్లీలో, అండర్-19 విభాగానికి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో డిసెంబరు 8, 9వ తేదీల్లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. జాతీయ పోటీలకు ఎంపికైన బాలికలను, వ్యాయామ ఉపాధ్యాయులు కె.మంగాయమ్మ, వీపీఎస్ శేషుకుమారి, డి.సత్యప్రియలను డీవైఈవో సత్యనారాయణ,ఎంఈవోలు శ్యాంబాబు, నారాయణదాసు, విద్యాకమిటీ చైర్మన్ విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

శైవ క్షేత్రాలు దర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



గురమంద జలపాతం వద్ద ట్రైనీ ఐఏఎస్‌లు



వై.రామవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలు పర్యటించేందుకు వచ్చిన 12 మంది ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ ఎస్‌ల బృందం బుధవారం మూడోరోజు మండలంలోని శైవ క్షేత్రాలను దర్శించుకుంది. గిరిజనుల జీవన విధానం, అలవాట్లు, మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై అధ్యయనం చేయడంతో పాటు కార్తీక మాసం సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉన్న గురమంద విశ్వనాథస్వామి,పూతి గుంట శివాలయాలు సందర్శించారు. ప్రకృతి జలపాతాల్లో సందడి చేశారు. వారి వెంట ఎంపీడీవో బాపన్న దొర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నన్నయ ఫాస్టెస్ట్ మహిళగా విహారిక



నాగవిహారికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

కాకినాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం(అక్నా) అథ్లెటిక్ పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.నాగవిహారిక ప్రతిభ కనబరిచింది. 100, 200 మీటర్ల పరుగు పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిందని పీఆర్వో జయదేవ్ తెలిపారు. అక్నా పరిధిలోని పరుగు పోటీల్లో అత్యంత తక్కువ సమయంలో ఈవెంట్‌ను పూర్తిచేసిన మహిళగా నమోదు కావడంతో యూనివర్శిటీ స్థాయిలో ఫాస్టెస్ట్ మహిళగా నిలిచిందన్నారు. జనవరి 12న బెంగళూరులో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ అథ్లెటిక్ పోటీల్లో అక్నా తరపున పాల్గొంటుందని తెలిపారు. నాగవిహారికను ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు, పీడీలు వర్మ, రమణ, దుర్గారావు, వెంకటేశ్వరరావు అభినందించారు.

హెచ్ఎం నిర్మలకుమారికి బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నిర్మల కుమారి

కాకినాడ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కాకినాడలోని జగన్నాథపురం సెయింట్ ఆన్స్ హైస్కూల్ హెచ్ఎం నిర్మల కుమారి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ నుంచి బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. ముస్లిం ఉపాధ్యాయులతో పాటు పది మంది క్రైస్తవ ఉపాధ్యాయులను, పది మంది క్రైస్తవ విద్యార్థులను అవార్డులకు ఎంపిక చేయడం పట్ల టీడీపీ క్రైస్తవ విభాగం రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ మోసిగంటి జోసెఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి వేలాడొద్దు!



ఆర్టీసీ బస్సుకు వేలాడుతూ ప్రమాదమని తెలిసినా విద్యార్థులు అలానే ప్రయాణిస్తున్నారు. కళాశాలలుకు విద్యార్థులు వెళ్లే ఉదయం, సాయంత్రం సమయాల్లో సరిపడా బస్సులు లేకపోవడం, కళాశాలలుకు సకాలంలో వెళ్లాలనే ఆతృతతో డోర్ వద్ద వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఉప్పాడ బస్టాండు వద్ద బుధవారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. (పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

సూర్యుడిలో చంద్రుడు!



ఇక్కడ మబ్బుల్లో కనిపిస్తున్నది చంద్రుడు కాదు సూర్యుడు. చంద్రుడి మాదిరిగా మబ్బుల్లో నుంచి కనిపించిన సూర్యుడిని పలువురు కనులారా వీక్షించారు. కాకినాడ జిల్లా పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల జాతీయ రహదారిపై నుంచి ఆకాశంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా దుర్ఘటన

- ఆటోను ఢీకొన్న లారీ
- ఆటో డ్రైవర్ మృతి... ఐదుగురు మహిళలకు తీవ్రగాయాలు
- ప్రత్తిపాడు హైవేపై ఘటన



సంఘటనా స్థలంలో ఆటో



మరణించిన ఆటో డ్రైవర్ ఆదివిష్ణు

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై బుధవారం ఆటోను గుర్తు తెలియని లారీ ఢీ కొన్న దుర్ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందగా ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం కిర్లంపూడి మండలం ముక్కోలు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు ఆటోలో ఇర్రిపాకలోని శివాలయానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగివస్తున్నారు. ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్ వద్ద ఆటో ప్రత్తిపాడు గ్రామంలోకి మలుపు తిరిగేందుకు రహదారిపై వేచి ఉండగా వెనుక నుంచి రాజమండ్రి నుంచి అన్నవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ వేగంగా ఢీకొంది. ఆటో డ్రైవర్ ఆర్.రాము ఆదివిష్ణు (54) తీవ్ర గాయాల పాలై మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న దొడ్డా వీరలక్ష్మి, కామిరెడ్డి గనిలక్ష్మి, కోలం సరోజిని, ఉమ్మిడి సీతామహాలక్ష్మి, వాసిరెడ్డి సత్య తీవ్రంగా యపడ్డారు. మహిళలకు స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స జరిపి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. ఆదివిష్ణు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అపీల కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవ స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

– ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

మార్మోగిన సత్యదేవ నామస్మరణ

- అన్నవరం దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో పడిపూజా కార్యక్రమం
- తరలివచ్చిన సత్యదీక్షా పరులు





పడిపూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి ప్రాంగణం బుధవారం రాత్రి సత్యదేవ నామస్మరణతో మార్మోగింది. జిల్లా నలుమాలల నుంచి వేలాదిగా తరలివచ్చిన దీక్షాపరులతో ఆలయ ప్రాంగణం పసుపుమయంగా మారింది. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజా కార్యక్రమాన్ని దీక్షాపరులంతా భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వార్షిక కల్యాణవేదిక వేదికపై అరటిడొప్పలతో అలంకరించిన వివిధ మండపాల్లో ప్రధానంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కుడివైపున క్షేత్రపాలకులు సీతారాములు, గణపతి, ఎడమభాగంలో పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను ఉంచి అర్చక స్వాములు పడిపూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా గణపతిపూజ నిర్వహించారు. అనంతరం మారేడు, జమ్మి, తులసి తదితర దళాలతో దీక్షాపరులు తమ ముందున్న మండపంలో అర్చకస్వాములు సత్యదేవుడి అష్టోత్తర సహస్రనామాలు పఠించగా మంత్రాలకుణుగుణంగా దీక్షాపరులు పూజలు గావించారు. భక్తిపాటలను దీక్షాపరులు ఆలపించారు. సుమారు 3వేలమంది అయ్యప్పస్వాములు, దీక్షాపరులు పాల్గొన్నారు. ఏ ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఏర్పాట్లు చేశారు. దీక్షాపరులందరికీ అల్పాహారాన్ని దేవస్థానం అందించింది.

నేడు సత్యదీక్షల విరమణ

అత్యంత నియమనిష్ఠలతో 27 రోజులు, 18 రోజులు, 9రోజుల సత్యదీక్షలు స్వీకరించిన సత్యదీక్షాపరులు గురువారం సత్యదీక్షలు విరమింపచేయనున్నారు. దూరప్రాంతాల నుంచి విచ్చేసిన కొందరు దీక్షాపరులు ఇరుముడులతో బుధవారం రాత్రికి ఆలయ ప్రాంగణానికి చేరుకోగా మరికొందరు వేకువజామున శిరస్సున ఇరుముడి ధరించి విచ్చేశారు. సత్యదీక్షాపరుల ఇరుముడులు పురస్కరించుకుని వార్షిక కల్యాణవేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీక్షావిరమణ అనంతరం వారందరికీ ఉచిత సామూహిక సత్యదేవుడి వ్రతాలను నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా

పట్టుకున్న కాకినాడ జిల్లా పోలీసులు

ఇద్దరు నిందితుల అరెస్ట్

213.28 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయితో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పోలీసు అధికారులు

కాకినాడ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను కాకినాడ జిల్లా పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.16,71,400 విలువైన 213.28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లేలాండ్ గూడ్స్ వాహనం, స్మార్ట్ ఫోన్‌ను సీజ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎన్‌హెచ్- 16 హైవేపై గంజాయి రవాణా జరుగుతుందని ఎస్పీకి వచ్చిన పక్కా సమాచారంతో ఆయన ఆదేశాల మెరకు పెద్దాపురం ఎస్ డీపీవో శ్రీహరిరాజు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ వైఆ ర్‌కె శ్రీనివాస్ తన బృందంతో రామవరం, రంగవల్లి నగర్ వద్ద వాహన తనిఖీలు చేప ట్టారు. విశాఖపట్నం వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న అశోక్ లీలాండ్ గూడ్స్ వాహనాన్ని ఆపి పారిపోతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సరుకు, వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజాఫర్నగర్ జిల్లా కటౌలి మండలం ఖోకాని గ్రామానికి చెందిన 36 ఏళ్ల మహ్మద్ షాహిద్, అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల రోహిత్ శర్మగా గుర్తించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునందనరావు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చోరీ కేసులో 624 గ్రాముల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

కాకినాడ క్రైం: ఓ దాబా వద్ద ఆగి ఉన్న బస్సులో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌ను తెరచి అందులోని సుమారు రూ.60 లక్షల విలువైన 624 గ్రాముల బంగారాన్ని అగంతుకులు ఈ ఏడాది సెప్టెంబరు 10న తస్కరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ కేసు నమోదు చేసి 3 బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గండేపల్లి మండలంలో ముగ్గురు అనుమానాస్పదంగా సంచరిస్తుండడాన్ని గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా విజయనగరానికి చెందిన పాతనేరస్తులు టి.నరసింహ, పి.తేజ, మహేందర్‌గా గుర్తించారు. వారు చేసిన నేరాన్ని అంగీకరించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.60 లక్షల విలువైన 5 జతల బంగారు గాజులు, 44 జతలు చెవిలీలు మెత్తం 624 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఎస్‌బీ డీఎస్పీ కెవి సత్యనారాయణ, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో
ఉమ్మడి జిల్లా జట్టుకు స్వర్ణ పతకం



స్వర్ణ పతకం సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం సాధించిందని అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మన జిల్లాకు తొలిసారిగా స్వర్ణ పతకం సపక్‌తక్రా కీడలో లభించిందన్నారు. ప్రథమస్థానం సాధించిన క్రీడాకారుల బృందంతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం క్యాంపు కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్‌బాలయోగిని కలుసుకున్నారు. సత్తాచాటిన బాల క్రీడాకారులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించి జాతీయస్థాయిలోను రాణించే విధంగా శిక్షణ పొందాలని సూచించారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలు అమలాపురం కేంద్రంగా నిర్వహించేందుకు ప్రణాళికలు తయారుచేసి ఇవ్వాలని సీనియర్ కోచ్ యాండ్ర గౌతమ్‌కు సూచించారు. క్రీడాకారులతో పాటు శిక్షణ ఇచ్చిన కోచ్ కేతా సతీష్, ఫిజికల్ డైరెక్టర్ బూల చిరంజీవి, టీమ్ మేనేజర్ జీవీ బాబులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, పేరూరి వెంకటేశ్వరరావు, అప్పారి మోహనరావు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన శివకృష్ణ

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. చింతూరు ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం... తెలంగాణ రాష్ట్రం దుమ్ముగూడెం మండలం చెరుపల్లికి చెందిన శివకృష్ణతో పాటు మరో ఇద్దరు ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి చింతూరు - విజయవాడ జాతీయ రహదారి నంబరు 31 మీదుగా భద్రాచలం వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా చింతూరు మండ లం తుమ్మల సమీపంలో అటుగా కాలినడకన వెళ్తున్న వ్యక్తిని శివకృష్ణ ద్విచక్ర వాహనంతో ఢీ కొన్నాడు. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న శివకృష్ణ (31) తలకు తీవ్రంగా గాయమై మృతి చెందాడు. ఇక కాలినడకన వెళ్తున్న వ్యక్తితో సహా వాహనంపై వెళ్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారి పరిస్థితి నిలకడగా ఉందని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

బాలింత మృతి వ్యవహారంలో వైద్యురాలిపై చర్యలు

డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలింత మృతి వ్యవహారంలో వైద్యురాలి(గైనకాలజిస్టు)పై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఆమెను కాకినాడ జిల్లా పిఠాపురం ఆసుపత్రి నుంచి రిలీవ్ చేసి తూర్పుగోదావరి జిల్లాలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యాలయానికి అటాచ్‌చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అసలేం జరిగిందంటే..?

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ అక్టోబరు 13న పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(ప్రభుత్వాసుపత్రి)లో చేరి 14న బిడ్డను ప్రసవించింది. అనంతరం అధిక రక్తస్రావమై సీరియస్ కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శ్రీదుర్గ అక్కడ మరణించగా బిడ్డ అనారోగ్యానికి గురైంది. దీనిపై మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. హైరిస్క్ కేస్ అని తెలిసినా చికిత్స, డెలివరీ సమయంలో ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ పి.సుజాత నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, గైనిక్ హెచ్‌వోడి డాక్టర్ అనురాగమయి, పీడీయాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యం, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, జీజీహెచ్ ఏవో శేషేంద్రశర్మ పిఠాపురంలో విచారణ నిర్వహించారు. మృతురాలి బంధువులు, చికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది.. ఆ రోజు విధుల్లో ఉన్న పారా మెడికల్ స్టాఫ్ నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి కేస్ షీటు, బిడ్డ ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు నివేదిక సమర్పించారు. నివేదిక ఆధారంగా దొండపాటి శ్రీదుర్గకు వైద్యం చేసిన గైనకాలజిస్టు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతను తక్షణం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి ఏటాచ్ చేయాలని కలెక్టర్ సూచించారు. దీంతో ఆమెను పిఠాపురం సీహెచ్‌సీ నుంచి రిలీవ్ చేసి డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉమ్మడి జిల్లా ఆసుపత్రి సేవల కోఆర్డినేటర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సుజాతను డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి ఎటాచ్ చేసిన నేపథ్యంలో వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా సామర్లకోట ప్రభుత్వాసుత్రి నుంచి డాక్టర్ కన్యాకుమారిని పిఠాపురం సీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్‌పై నియమించారు. ఆమె విధులకు హాజరయ్యారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



వెంకటరమణ (ఫైల్)

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి ప్రాంతానికి చెందిన దేవగుప్తాపు వెంకటరమణ (52) బుధవారం మరోవ్యక్తి కలిసి మోటారుసైకిల్‌పై పోలవరం వైపు వెళ్తున్నారు. వారిని కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. వెంకటరమణ కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమార్తె మానేపల్లి సాయిశ్రీ అందించిన ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వెనుక కూర్చున వ్యక్తికి ఏ గాయాలు కాలేదన్నారు.

లారీని ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు

గండేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం.. జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు గండేపల్లి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

యువకుడికి తీవ్రగాయాలు

గండేపల్లి మండల యల్లమిల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కెనాయకంపల్లి నుంచి యల్లమిల్లి వెళ్తున్న పాల వ్యాను ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో మోటారుసైకిల్‌పై ఉన్న యల్లమిల్లికి చెందిన మామిడిపాక ఈశ్వర్‌కల్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రాజమండ్రి తరలించారు.

మిఠాయి కొనొచ్చేలోపు మోటారుసైకిల్ డిక్కీలోని
రూ.5 లక్షల దొంగతనం

అల్లవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోడూరుపాడు సెంటర్ వద్ద మంగళవారం మోటారు సైకిల్ డిక్కీలో ఉంచిన రూ.5లక్షల నగదు చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లవరం మండలం గూడాల గ్రామానికి చెందిన మోకా వెంకటేశ్వరరావు-సత్యవతి దంపతులు అమలాపురం బ్యాంకులో రూ.5లక్షల నగదు డ్రా చేసుకుని మోటారుసైకిల్ డిక్కీలో ఉంచారు. కోడూరుపాడు సెంటర్‌లో మిఠాయి కొట్టు వద్ద ఆగి మిఠాయి కొనుగోలు చేశారు. తర్వాత చూస్తే మోటారుసైకిల్ తాళం కనిపించకపోవడంతో వెంకటేశ్వరరావు ఇంటి వద్ద నుంచి మరో తాళాన్ని తెప్పించి మోటారుసైకిల్ డిక్కీ తెరవగా డిక్కీలో ఉంచిన రూ.5లక్షల నగదు, సెల్‌ఫోన్ మాయమైనట్టు గుర్తించి అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేశామని, రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్‌ను సందర్శించిన విద్యుత్ సౌదా హైడల్ డైరెక్టర్



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో పర్యటిస్తున్న హైడల్ డైరెక్టర్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్, సిబ్బంది

మోతుగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్‌లో బుధవారం విజ యవాడ విద్యుత్ సౌదా హైడల్ డైరెక్టర్, ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఫైనాన్స్ సృజయ్ కుమార్ పర్యటించారు. కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఏపీ జెన్కో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 230మెగావాట్ల 5,6 యూనిట్ల జల విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించారు. 5,6 యూనిట్ల పనులకు సంబంధించి ఓవల్ ఆఫీస్ బటర్ఫై వాల్ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అలాగే 5, 6 యూనిట్ల పెన్‌స్టాక్ పైప్లైన్ పనులను పరిశీలించారు. సివి ల్ పనుల ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణని అడిగి తెలుసుకున్నారు. 5,6 యూనిట్లకు సంబంధించి సివిల్, మెకానికల్ పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయన్నారు. సాధ్య మైనంత త్వరగా 5,6 యూనిట్ల పనులను పూర్తి చేస్తే ఇప్పుడున్న 460 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి తోడు మరో 230 మెగావాట్లు తోడై మొత్తంగా 690 మెగావాట్ల ఉత్పత్తి ఈ జల విద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎత్తిపోతల పనులకు సంబంధించి అప్పర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి బయలుదేరారు. కార్యక్రమంలో విజయవాడ హైడల్ సివిల్ సీఈ పి.రవీందర్‌రెడ్డి, టీయూఎన్ శ్రీనివాస్, ఎస్సీ హైడల్ ఎం.విజయవాడ సివిల్ హైడల్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వెంకట రాజారావు, ఎస్సీ చిన్నకామేశ్వర రావు, టెక్నికల్ డీఈ వరప్రసాద్, సివిల్ ఎస్సీ చంద్రశేఖర్ రెడ్డి, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగ శ్రీనివాస్, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వర ప్రసాద్ సివిల్, ఏడీఈలు కొండబాబు, నరసింహులు అసిస్టెంట్ ఇంజనీర్లు పవన్ విజయ్ ఉన్నారు.

అవిశ్వాస తీర్మాన సమావేశం రద్దు

సామర్లకోటలో మున్సిపల్ కౌన్సిలర్ల అసహనం

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణపై సొంత పార్టీకి చెందిన 24 మంది వైసీపీ కౌన్సిలర్లు రెండోదఫా పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశం హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం రద్దు చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కౌన్సిల్‌హాలులో సమావేశాన్ని రద్దు చేసినట్టు ప్రకటించి తిరిగి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ముందుగా ఇచ్చిన నోటీసుల మేరకు వైసీపీకి చెందిన 24 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. సదరు సమావేశానికి హాజరుకావాల్సిన ప్రత్యేకాధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు హాజరుకాకపోవడంతో హైకోర్టు ఆదేశాలను ఆర్డీవో ద్వారా కమిషనర్ తెలుసుకుని కౌన్సిలర్లకు సదరు సమావేశం రద్దయినట్లు తెలియజేశారు. దీంతో కౌన్సిలర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. మెజార్టీ సభ్యులు సమావేశానికి హాజరైనట్లు గుర్తించి తమకు ఆర్డీవో నుంచి లేఖలు ఇస్తే తాము సమావేశం నుంచి వెళ్లిపోతామని స్పష్టంచేశారు. దీంతో కమిషనర్ కాకినాడలో ఉన్న ఆర్డీవో మల్లిబాబుతో ఫోన్ ద్వారా చర్చించి ఆర్డీవో సంతకంతో కూడిన లేఖలను హాజరైన కౌన్సిలర్లకు అందజేశారు. దీంతో పరిస్థితి తాత్కాలికంగా సద్దుమణిగింది.

'ఏలేరు'లో తగ్గిన నీటి నిల్వలు

ఏలేశ్వరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. బుధవారం ఎగువ ప్రాంతం నుంచి 1175 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. కాగా 85.53 మీటర్ల స్థాయిలో 22.02 టీఎంసీలు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రైవేట్‌పరం కాదు

» వైసీపీవి అసత్య ప్రచారాలు » జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితమే మెడికల్ కాలేజీ ప్రారంభమైందని, దీన్ని మళ్లీ ప్రైవేట్‌పరం చేయడం జరగదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన రాజమహేంద్రవరం జీజీహెచ్ ఆవరణలో పలువురు కాంగ్రెస్ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రైవేట్‌పరం అయిపోతుందని వైసీపీ నాయకులు ప్రజలను మభ్యపెడుతూ వారిని రెచ్చగొట్టడం సరికాదని అన్నారు. నగరంలో నిర్వహించిన ర్యాలీకి జనాలను రప్పించేందుకు ఇలా ప్రచారం చేస్తూ, తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీని ఎవరూ ప్రైవేట్‌పరం చేయలేరని, ఒకవేళ అలా జరిగితే తాను ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ దగ్గర ఆమరణ నిరాహార దీక్ష చేస్తాను అని ప్రకటించారు. కాగా, అంతకుముందు జిల్లా, నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు టీకే విశ్వేశ్వరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల కొత్తగా జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ వీవీవీ సత్యనారాయణను జీజీహెచ్‌లోని ఆయన ఛాంబర్‌లో కలసి సత్కరించారు.

యూరియా కోసం పాట్లు

సీతానగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం రాపాక సొసైటీ వద్ద యూరియా కోసం నల్గొండ, రాపాక గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బస్తాలు తీసుకునేందుకు పోటీ పడడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో సొసైటీ వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుల్స్ వచ్చి బందోబస్తు నిర్వహించారు. అయితే రైతులు యూరియా కోసం ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న మండల వ్యవసాయాధికారి ఎ.గౌరీదేవి వచ్చి పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఎకరానికి ఒక బస్తా చొప్పున అందిస్తామని, ఐదు ఎకరాలుంటే నాలుగు బస్తాలు ఇచ్చి మిగిలినది తరువాత ఇస్తామని తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులకు గురువారం ఇస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. కాగా సొసైటీలో 900 బస్తాలు ఉన్నాయని, 425 బస్తాలు వస్తాయని సీఈవో కాట్నం వెంకటేశ్వరరావు తెలిపారు.

జీఎస్‌ఎల్‌లో ముగిసిన కత్తిసాము పోటీలు

రాజానగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన సాంప్రదాయక దేశీయ క్రీడ ఫెన్సింగ్ (కత్తిసాము) యువతలో మరింతగా విస్తరింపచేసి, ఒలింపిక్స్‌కు తీసుకెళ్లడమే లక్ష్యం కావాలని జీఎస్‌ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆకాంక్షించారు. రాజానగరం సమీపంలోని జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 12వ రాష్ట్ర స్థాయి సీనియర్ల ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలు బుధవారం ముగిశాయి. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ రాష్ట్ర చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 250 మంది బాలికలు, బాలురు పాల్గొన్నారు. విజేతలకు మూడు విభాగాల్లో నలుగురు వంతున 24 మందిని నేషనల్స్‌కు ఏపీ ప్లేయర్లుగా ఎంపికైనట్టు నిర్వాహకులు ఎస్.సతీష్ బాబు తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, సీనియర్ ప్లేయర్లు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో నా పోలీస్ -నా పోలీస్‌స్టేషన్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో నా పోలీస్-నా పోలీస్‌స్టేషన్ అనే నూతన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ శ్రీకారం చుట్టారు. పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ వార్డు అడాప్టెడ్ కానిస్టేబుల్స్, గ్రామ మహిళ పోలీసులు ప్రజల భాగస్వామ్యంతో వారి సమస్యలను నేరుగా పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించిన ఎస్పీ పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్‌లో ఇంటి భద్రత, సైబర్, మహిళా భద్రత, ఎల్‌హెచ్‌ఎంఎస్, డయల్ 112, శక్తి యాప్‌లపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టూటౌన్ సీఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

చాపకింద నీరులా న్యూమోనియా: డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చాపకింద నీరులా న్యూమోనియా విస్తరిస్తోందని, ఏటా బాధితుల సంఖ్య పెరుగుతోందని, ఒకరి నుంచి మరొకరికి త్వరగా ఈ లక్షణాలు వ్యాపిస్తాయని పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. కుటుంబంలో ఒకరికి వస్తే అందరిపై ప్రభావం చూపుతోందని, ముఖ్యంగా చిన్న పిల్లల్లో అధికంగా ప్రభావం చూపే ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన న్యూమోనియా వ్యాధిని నియంత్రించేందుకు సామాజిక అవగాహన, నివారణ చర్య' (ఎస్‌ఏఎన్‌ఎస్) కార్యక్రమం ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందన్నారు. రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీల పరిధిలోని 0 నుంచి 5 ఏళ్ల పిల్లల్లో న్యూమోనియాని గుర్తించి చికిత్సతో నివారించడమే లక్ష్యమని చెప్పారు.

అర్హులందరికీ ఇళ్లు



దామిరెడ్డిపల్లిలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ ఇల్లు ఇవ్వడమే కూటమి ధ్యేయం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియంలో మురమళ్ల వీరభద్రరావు పీఎంఏవై పథకంలో ఇల్లు నిర్మించుకున్నాడు. బుధవారం జరిగిన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే గోరంట్ల విచ్చేసి వీరభద్రరావు దంపతులకు పట్టువస్త్రాలు అందజేశారు. ఐదేళ్లలో ఇల్లు లేని ప్రతిఒక్కరికీ ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం కడియపుసావరంలో డ్రైను, దుళ్లలో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఇదిలా ఉండగా దామిరెడ్డిపల్లిలో నిర్మించిన రోడ్డును, సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు దామిరెడ్డిపల్లి రోడ్డుకు రూ.1.80 కోట్ల నిధులు మంజూరు చేయించి, నిర్మాణం పూర్తి చేయించామన్నారు. అలానే మురమండ-దుళ్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని పుష్కరాల నాటికి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. సందర్భంగా టీడీపీ దామిరెడ్డిపల్లి అధ్యక్షుడిగా గాజుల రామచంద్రరావును ఎన్నిక చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గోరంట్ల ఆయనకు కండువా వేసి పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, ముద్రగడ సత్యస్వరూప, చెక్కపల్లి మురళి, నాయకులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ఆదిమూలం సాయి, వరగోగుల వెంకటేశ్వరరావు, మార్గాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో 776 ఇళ్లు నిర్మాణం: నల్లమిల్లి

బిక్కవోలు: బిక్కవోలులో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో గోలి వెంకటరత్నం నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గంలో రూ.14 కోట్ల వ్యయంతో 776 ఇళ్లను నిర్మించామన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందని, పీఎంఏవై పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఎంపీపీ తేతలి సుమ, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కూటమి నేతలు బేరా వేణమ్మ, కర్రి సత్యగౌరి, పడాల వెంకటరామారెడ్డి, ఇందల వీరబాబు, దుర్గారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
» పలుచోట్ల గృహప్రవేశ కార్యక్రమాలు

రాజమహేంద్రవరం అర్బన్‌లో 3097: వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 46వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా ముఖ్యఅతిథులుగా విచ్చేసి టి.జానకి అనే లబ్ధిదారురాలికి పీఎంఏవై అర్బన్ బీఎల్‌సీ స్కీమ్ కింద మంజురైన గృహాన్ని ప్రారంభించారు. ఆమెకు ఇంటి తాళాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చివరిలో రాత్రికిరాత్రే పనికిరాని ఇళ్ల పటాలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.14.95 కోట్లతో 3097 గృహాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. గతంలో గృహాలకు రూ.1.80 లక్షలు ఇచ్చేవారని, కూటమి వచ్చాక బీసీ,ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీజీటీలకు రూ.లక్ష చొప్పున అదనంగా ముంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా అర్బన్‌లో 747 మందికి అదనంగా లబ్ధి చేకూరిందన్నారు. అలాగే నిర్మాణానికి 20టన్నులు ఇసుక ఉచితంగా అందజేస్తోందన్నారు. తమ ప్రభుత్వం షరతులులేని సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో చట్టబద్ధత లేని పట్టాలను ప్రజలకు ఇచ్చి మోసం చేస్తే తాము అధికారంలోకి వచ్చాక ఆ పట్టాలకు చట్టబద్ధత కల్పించామన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు లక్షల ఇళ్లకు ప్రభుత్వం గృహప్రవేశాలు చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందన్నారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ఇళ్లులేని పేదలకు స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్, హౌసింగ్ డీఈ సూరిబాబు, నాయకులు మొకమాటి సత్యనారాయణ, అగురు ధనరాజు, యానపు యేసు, తురకల నిర్మల పాల్గొన్నారు.



బిక్కవోలు ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



లబ్ధిదారురాలికి ఇంటి తాళాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

శివుడికి పారిజాత పుష్పాలంకరణ

బిక్కవోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పారిజాత పుష్పాలంకరణలో శివుడు బుధవారం దర్శనమిచ్చాడు. ఆలయ ఆవరణలోని శివలింగాన్ని గ్రామానికి చెందిన శేఖర్ రెండు వేల పారిజాత పుష్పాలతో అలంకరించాడు. అధిక సంఖ్యలో భక్తులు శివయ్యను దర్శించుకున్నారు.

ప్రత్యేక పాలనలో అభివృద్ధి తిరోగమనం



పంచాయతీ కార్యదర్శిని వివరణ అడుగుతున్న ఎమ్మెల్యే బత్తుల

» దివాన్‌చెరువు పంచాయతీలో రూ1.70 కోట్లు నిధులు
» అయినా ఎక్కడి సమస్యలు అక్కడే
» జనవాణిలో ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు పంచాయతీలో నిధులు దాదాపు రూ1.70 కోట్లు ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కరించకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని, ప్రత్యేకాధికారి పాలనలో ఈ పంచాయతీలో అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. దివాన్‌చెరువులో బుధవారం జనవాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల నిర్వహించారు. దివాన్‌చెరువు, శ్రీరాంపురం, రఘునాథపురం గ్రామాల నుంచి హాజరైన ప్రజలు పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని, వీధిలైట్లు సరిగా వెలగడం లేదని, కనీసం పంచాయతీలో బ్లీచింగ్ కూడా ఉండడం లేదంటూ ఫిర్యాదులు చేశారు. అలాగే రహదార్లు, డ్రైన్లు, తాగునీరు, పేరుకుపోయిన చెత్త తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ దివాన్‌చెరువు అపారిశుధ్యంతో మురికికూపంగా మారిందన్నారు. దీనిపై పంచాయతీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి బాధ్యుల వారిపై చర్యలు తీసుకోవాలని కోరతానన్నారు. దీనిపై కార్యదర్శి కె.హనుమంతరావును వివరణ అడిగారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దివాన్‌చెరువు పంచాయతీ ప్రత్యేకాధికారిగా గత జిల్లా కలెక్టర్ బాధ్యతలు నిర్వహించినంత కాలం గ్రామాభివృద్ధికి సంబంధించి ఒక్క తీర్మానానికి కూడా సంతకం చేయకపోవడం విచారకరమన్నారు.నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని ఖర్చుచేసి ప్రజల సమస్యలను పరిష్కరించకపోవడంపై అసహనాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో, తహశీల్దారు, ఈవోపీఆర్డీ హాజరుకాకపోవడం ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే సచివాలయం-3 ఇంజనీరింగ్ అసిస్టెంట్ విధులకు సక్రమంగా హాజరుకాకుండా వేతనం తీసుకుంటున్నట్టు తన దృష్టికి వచ్చిందని దీనిపై విచారణ జరిపిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెరువులను అభివృద్ధి చేయాలని, ఇళ్ల పట్టాలు, పింఛన్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేకు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



సుబ్బారావు

రంగంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందవరం గ్రామానికి చెందిన జుత్తుక సుబ్బారావు (55) అదృశ్యమైనట్టు ఎస్.ఐ ఎస్. శివప్రసాద్ తెలిపారు. సుబ్బారావుకు రెండేళ్ల క్రితం తలకు గాయమవ్వడంతో అప్పుడప్పుడూ మతిస్థిమితం లేకుండా ఉంటున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 3వ తేదీ ఉదయం తన కుమార్తె జయలక్ష్మి ఇంటికి బొర్రంపాలెం వెళ్లొస్తానని చెప్పారని, ఇప్పటి రాలేదని, అన్నిచోట్ల వెతికినా కనిపించకపోవడంతో బుధవారం కుమారుడు జుత్తుక నవీన్ పోలీసులకు ఫిరాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. సుబ్బారావు ఆచూకీ తెలిస్తే రంగంపేట ఎస్ఐ 94408 04854, అనపర్తి సీఐ 94407 96538 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని చెప్పారు.

రాజమహేంద్రి టీడీపీ కంచుకోట



రాజమహేంద్రవరంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే వాసు

» పార్టీ జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు గౌరవం
» ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
» పలుచోట్ల క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎప్పుడైనా రాజమహేంద్రవరం తెలుగుదేశం పార్టీకి కంచుకోటేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం పలుచోట్ల బుధవారం జరిగింది. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో మంగళగిరి తర్వాత రాజమహేంద్రవరానికే ఎక్కువగా వచ్చాయన్నారు.మనమంతా క్రమశిక్షణతో పని చేసి పార్టీ అధికారంలోకి వచ్చేందుకు చాలా కష్టపడ్డామన్నారు. ప్రజల పక్షాన పోరాడినందుకే గత వైసీపీ ప్రభుత్వం తమపై కేసులు పెట్టిందని అయినా పట్టించుకోకుండా కేడర్ కోసం, ప్రజా సమస్యలపై పోరాటం చేశామని గుర్తుచేశారు. మంత్రి నారా లోకేశ్ ఈ నెల 18న నగరానికి వస్తున్నారని, ఆయన పర్యటన విజయవంతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కుడుపూడి సత్తిబాబు, యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, నక్కా చిట్టిబాబు, వర్రే శ్రీనివాస రావు, దొండపాటి సత్యంబాబు, తవ్వా రాజా, ఉప్పులూరి జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: బిక్కవోలు మండలం బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి టీడీపీ క్లస్టర్, బూత్, మండల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవానికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చ య్య చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముం దుగా టీడీపీ అధినేత ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో గోరంట్ల మాట్లాడుతూ దేశంలో అత్యధిక కార్యకర్తల బలం ఉన్న పార్టీ టీడీపీ మాత్రమేనని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపుతో బాటు గౌరవం లభిస్తుందన్నారు.మనోజ్‌రెడ్డి పార్టీ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారని, ఆయనకు ప్రతి కార్యకర్త అండగా నిలవాలన్నారు. వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ భూస్థాపితం అవుతుందని జోస్యం చెప్పారు. అనంతరం నూతన కమిటీలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి ఆకుల రామకృష్ణ, సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ల గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు, జుత్తుక సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని బూరుగుపూడిలో టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి టీడీపీ కమిటీల ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రైతు కమిటీ అధ్యక్షుడిగా బొల్లేద్దుపాలేనికి చెందిన పుప్పాల వెంకటరత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన పార్టీ నాయకులందరికి ఆకుపచ్చ కండువాలు బహూకరించారు. అలాగే బీవీఆర్‌కు నాగలి అందజేశారు. అనంతరం టీడీపీ కోరుకొండ మండలాధ్యక్షుడిగా దూది కాంతారావు, రాజానగరం అధ్యక్షుడిగా గంగిశెట్టి సత్తిబాబు, సీతానగరం అధ్యక్షుడిగా గెడ్డం తమ్మారావు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే క్లస్టర్ ఇన్‌చార్జిలుగా రొంగల శ్రీనివాస్, అడపా వీరబాబు, డిడ్డి మాధవరావుతోపాటు 46 మంది యూనిట్ అధ్యక్షులుగా, 71 మంది గ్రామ కమిటీ అధ్యక్షులుగా, 216 మంది బూత్ కమిటీ ఇన్‌చార్జిలుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకుడు రాజా సూరిబాబు రాజు, తనకాల నాగేశ్వరరావు, కంటే కేశవరావు, గంటిశెట్టి సత్తిబాబు, పెదపాటి భీమరాజు, మాతా సీతారాముడు, మార్ని రాము, ధారా రాంబాబు, పీతా శ్రీనుబాబు, గుర్రం ఈశ్వరరావు పాల్గొన్నారు.



బలభద్రపురంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల



కోరుకొండలో బీవీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న వెంకటరత్నం

ఎన్నికల్లో బీఎల్‌వోలు కీలకం: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్-2026కు సంబంధించి 2002 ఓటర్ల జాబితాను ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాతో వెరిఫికేషన్ చేసి ఓటర్ల మ్యాపింగ్ ఏ విధంగా చేయాలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విధి విధానాలు వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల ద్వారా ఓటర్ల నమోదుకు సంబంధించిన విధి విధానాలు, బూత్ స్థాయి అవలంబించాల్సిన నిబంధనలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తదితర అంశాలపై సమగ్రమైన అవగాహన వస్తుందన్నారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఇళ్లకు వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, వయస్సు చిరునామ ఆధారాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దాలన్నారు.

వంద శాతం పన్నులు వసూల్ కావాలి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నులు వంద శాతం వసూల్ కావాలని కమిషనర్ రాహుల్‌మీనా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకార్యాలయం పిజిఆర్ఎస్ హాలులో బుధవారం సాయంత్రం రెవెన్యూ అధికారులతో పన్నుల వసూళ్లపై నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు.నగరంలో ప్రతి ఇంటికి ఆస్తిపన్ను విధిగా ఉండాలన్నారు. సచివాయల పరిపాలన కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని పరిశీలించి అండర్ అసెస్మెంట్ ,అన్ అసెస్మెంట్ , ఖాళీ స్థలాల పన్నులు విధించాలన్నారు. బేస్ రిజిష్టర్ ఆధారంగా డిమాండ్ నోటీసులు ఇచ్చేటప్పుడు ఇళ్ళకు పన్ను పెంచవలసిన అవసరం ఉన్నదీ లేనిదీ గుర్తించాలన్నారు. ఇంచార్జి అడ్మిన్లు సెక్రటరీలు ఉన్న చోట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి తగిన విధంగా దిశా నిర్దేశం చేయాలన్నారు. ప్రతి రోజు సర్వే ,పన్ను విధింపు పురోగతి పై నివేదికలను అందజేయాలని ఆదేశించారు.

షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు

కోరుకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోనే పేరెన్నిక గన్న కోరుకొండ శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆలయ కమిటీ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి పునః ప్రతిష్ఠింపబడిన నూతన ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉల్లి బుజ్జిబాబు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి డిసెంబరు 1 వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 26న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం, వీరభద్ర సంబరం, సినీ సంగీత విభావరి, 30న 108మంది దంపతులతో శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. 27న బాయ్స్ డ్యాన్స్ ప్రోగ్రాం, 28న సినీ మ్యూజికల్ నైట్, 29న వెరైటీ బుర్రకథ, కూచిపూడి భరతనాట్య ప్రదర్శన, 30న సినీ మ్యూజికల్ నైట్, డిసెంబర్ 1న స్వామి వారి గ్రామోత్సవం సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బదిరెడ్డి సత్యనారాయణ మూర్తి, వట్టిపల్లి సత్యనారాయణ, కటకం సత్యనారాయణ, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



అనపర్తిలో వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరుతూ బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఆ పార్టీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విలేకరులతో మాట్లాడుతూ కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి డబ్బుల్లేవనే సాకుతో ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తోందన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జీజీహెచ్‌ను కూడా ప్రైవేట్‌పరం చేసే ఆలోచన చేస్తున్నారని, వేల కోట్ల రూపాయల మెడికల్ కాలేజీ ఆస్తులను ప్రైవేట్‌పరం చేసే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి సుమారు రూ.8 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తే, గతంలోనే రూ.3 వేల కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన రూ.5 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా ఇచ్చేందుకు రెడీగా ఉందన్నారు. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేటీకరణ జపం చేస్తున్నారని, ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ ఈ ఉద్యమం ఆగదని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల నిరసన
సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

రాజానగరం: మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో రాజానగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి, గూడూరి శ్రీనివాస్, చందన్ నాగేశ్వర్ పాల్గొన్నారు.

అనపర్తి: మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేకుంటే అనేక మంది పేద విద్యార్థులు మెడిసిన్ విద్యకు దూరమవుతారన్నారు.

కూటమి.. పేదల పక్షపాతి

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని గంగంపాలెంలో సుమారు 40 సంవత్సరాలుగా కొండపోడు, సీలింగ్ భూమిని సాగు చేసుకుంటున్న 56మంది రైతులకు భూమి హక్కు కల్పించే విధంగా పట్టాదారు పాస్ పుస్తకాలను బుధవారం ఆయన అందజేశారు. అనంతరం గంగంపాలెం, ఠాకూరుపాలెం గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దారు రామకృష్ణ, టీడీపీ నాయకులు సాలెపు నలమహరాజు, పిల్లా చంటిబాబు, ఉంగరాల రాము, పాలూరి బోస్, గళ్లా రాము, తదితరులు పాల్గొన్నారు.





సొంతిల్లు.. సంతోషం

- జిల్లాలో 8,773 ఇళ్లలో గృహ ప్రవేశాలు
- ఎమ్మెల్యేలు, అధికారుల సమక్షంలో వేడుక
- పేదల సొంతింటి కల సాకారం

రాజమహేంద్రవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా పడిన అడుగు సామూహిక గృహ ప్రవేశాల రూపంలో బుధవారం నిజమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మొండి గోడలతో అసంపూర్తిగా నిలిచిన ఇళ్లతో లబ్ధిదారుల కళ్లల్లో ఆవేదన నిండిపోతే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో పూర్తిచేసిన ఇళ్లలో గృహ ప్రవేశాలతో అందరి కళ్లలో సంతోషం నెలకొంది. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పూర్తిచేసిన ఇళ్లలోకి ఎమ్మెల్యేలు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులు ఆనందంతో తొలి అడుగు పెట్టారు. కొందరికి గృహాల మంజూరు, అనుమతి పత్రాలను కూడా అందజేశారు. నిడదవోలులో మంత్రి దుర్గేష్ గృహ నిర్మాణ అనుమతి పత్రాలను అందజేశారు. ప్రజలందరికీ ఇళ్ల నిర్మాణం చేయాలన్న సంకల్పంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం 2.0ను సీఎం చంద్రబాబు శ్రీసత్యసాయి జిల్లాలో ప్రారంభించారన్నారు. ఆయన ఆదేశాలతో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు సామూహిక గృహ ప్రవేశాల్లో పాల్గొన్నారని చెప్పారు. వైసీపీ హయాంలో సెంటు స్థలం ఇస్తామని జగన్ చెప్పారని, అయితే ఆ స్థలం ఎటూ సరిపోదని భావించి కూటమి ప్రభుత్వం అర్బన్‌లో రెండు సెట్లు, గ్రామీణంలో మూడు సెంట్ల స్థలాన్ని ఇచ్చిందన్నారు. తద్వారా పేదలకు విశాలమైన సొంతింటిలో నివసించే అవకాశాన్ని సీఎం చంద్రబాబు కల్పించారన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 1170 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కడియం నియోజకవర్గంలో 375 ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేశామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. లబ్ధిదారులకు తాళాలు అందజేసి గృహ ప్రవేశాలు చేయించారు. రాజమహేంద్రవరంలోని 46వ వార్డులో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. నగరంలో 465 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే చెప్పారు. లబ్ధిదారులకు ఉచిత ఇసుక పథకం కింద ఒక్కో ఇంటికి 20 టన్నుల ఇసుకను అందజేయడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణ సహాయాన్ని గతంకంటే ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీజీటీ వర్గాలకు రూ.లక్ష అదనంగా ఇస్తున్నామన్నారు. దీంతో నగరంలోని 3097 మంది లబ్ధిదారుల్లో 747 మందికి అదనంగా లబ్ధి చేకూరిందని తెలిపారు. కొవ్వూరు పట్టణం 1వ వార్డు శ్రీరామకాలనీలో గృహ ప్రవేశ పండుగలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రతి పేద వాడికి కూడు, గూడు, గుడ్డ అందించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పథకాలకు రూపకల్పన చేస్తున్నారని చెప్పారు. కొవ్వూరు అర్బన్ పరిధిలో 2826 ఇళ్ల నిర్మాణానికి రూ.40కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం గృహ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం పోతవరం గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు పెదపాటి వెంకమ్మకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఇంటి తాళం అందజేశారు. ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. అనపర్తి నియోజకవర్గం బిక్కవోలులో బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో గోలి వెంకటరత్నం నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి పేర్కొన్నారు.





గోకవరం మండలం కామరాజుపేటలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ. పక్కన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ కీర్తి చేకూరి.. మరో నివాసంలో లబ్ధిదారులకు దుస్తులు బహుకరిస్తున్న దృశ్యం

'నిరుపేదలకు సొంతిల్లు సమకూర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం'

కామరాజుపేటలో గృహాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా కలెక్టర్

గోకవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇల్లులేని నిరుపేదలకు సొంతిల్లు సమకూర్చి వారి కలలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. గోకవరం మండలం కామరాజుపేట గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ 2.0లో భాగంగా నిర్మించిన రెండు గృహాలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ప్రతీ పేదవానికి సొంతిల్లు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గత 17 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు నిర్వహించడం ప్రభుత్వ సంకల్ప బలానికి నిదర్శనమన్నారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష చేస్తున్నారన్నారు. పీఎం ఆవాస్ యోజన 2.0 ద్వారా ఇంకా పూర్తి ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతను అందిస్తాయన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో జలజీవన్ మిషన్ కింద కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించినట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ అభ్యర్థన మేరకు జాతీయ రహదారులపై ప్రమాదాలకు గురైన బాధితులకు తక్షణం వైద్యం అందించి వారిని రక్షించేందుకు ప్రధాన కూడళ్లల్లో ట్రామాకేర్ సెంటర్‌లను ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 8,773 మంది లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకొని బుధవారం గృహ ప్రవేశాలు చేసుకుంటున్నారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన్- అర్బన్‌లో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీ పరిధిలో 800 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. యూనిట్‌కు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నందున లబ్ధిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, సర్పంచ్ అడపా వెంకట్రావు పాల్గొన్నారు.

నిడదవోలులో కైవల్యారెడ్డిని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

కైవల్యారెడ్డికి మంత్రి దుర్గేష్ అభినందన

నిడదవోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణానికి చెందిన విద్యార్థిని కుంచాల కైవల్యారెడ్డి అంతరిక్ష యాత్రకు ఎంపిక కావడం పట్ల మంత్రి దుర్గేష్ సంతోషం వ్యక్తంచేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. బుధవారం నిడదవోలు పట్టణంలో మంత్రి దుర్గేష్‌ను అంతరిక్ష యాత్రకు ఎంపికైన కైవల్యారెడ్డి తన తల్లితండ్రులు శ్రీనివాసరెడ్డి, విజయలతో కలసి కలిసింది. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి చిన్న ప్రాయంలోనే అంతరిక్ష పరిశోధనారంగంలో గుర్తింపు తెచ్చుకున్న కైవల్య భవిష్యత్తులో ఖగోళ శాస్త్రవేత్తగా ఎదిగి భారత దేశానికి సేవలు అందించాలన్నారు. అమెరికా రాష్ట్రంలోని ఫ్లోరిడాలో జరిగే వ్యోమగామి శిక్షణకు ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి వేలాది మంది పోటీపడగా 150 మంది మాత్రమే అర్హత సాధించారని, వారిలో కైవల్యారెడ్డి ఉండడం ఎంతో అభినందనీయమన్నారు.

'నా పోలీస్ -నా పోలీస్ స్టేషన్'

రాజమహేంద్రవరంసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'నా పోలీస్ -నా పోలీస్ స్టేషన్' అనే కొత్త కార్యక్రమానికి ఎస్పీ నరసింహకిషోర్ శ్రీకారం చుట్టారు. పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామ, వార్డు అడాప్టెడ్ కానిస్టేబుల్స్, గ్రామ మహిళా పోలీసులు, ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను నేరుగా పరిష్కరించే చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

'ఆంధ్రజ్యోతి' విజిట్..

గందరగోళం



గోకవరంలో ఓ సచివాలయం వద్ద సిబ్బంది సర్వే నిమిత్తం ఫీల్డ్‌లో ఉన్నారు, గమనించగలరు అని బోర్డు పెట్టిన దృశ్యం

- సచివాలయాల్లో ఇష్టానుసారంగా అధికారుల పనుల అప్పగింత
- అందుబాటులో ఉండని ఉద్యోగులు
- చేయాల్సింది ఒకటి.. చేసేది ఇంకొకటి
- సర్వేలతో సరి.. అమలుకాని క్లస్టర్ విధానం
- డిజిటల్ అసిస్టెంట్లపైనే పనిభారం
- సక్రమంగా వినియోగించుకుంటే విజన్ యూనిట్లుగా మంచి ఫలితాలు

రాజమహేంద్రవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు గందరగోళంగా మారాయి. చాలాచోట్ల కళ తప్పాయి. కొందరు సచివాలయంలో అందుబాటులో ఉండని పరిస్థితి ఉంది. గతంలో నిర్ణయించిన జాబ్ చార్ట్ కూడా సక్రమంగా అమలు కావడం లేదు. ఈ ఉద్యోగులను కచ్చితంగా విజన్ కోసం ఉపయోగించుకుంటే మంచి ఫలితాలే ఉంటాయి. అందరూ ఉన్నత విద్యావంతులే. మొదట్లో ఒక్కో సచివాలయానికి 11 మంది ఉద్యోగులు వరకూ ఉండేవారు. తాజాగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈ సచివాలయాలను విజన్ యూనిట్లుగా మార్చే ప్రయత్నంలో ఉంది. త్వరలో సచివాలయాల పేర్లు కూడా మారనున్నాయి. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులను వినియోగించుకోవడంలోనూ సరైన స్పష్టత ఇంతవరకూ కనిపించలేదు. పైగా వారికి ప్రమోషన్ల విధానం కూడా సరిగ్గా లేదు. ఇటీవల పంచాయతీ గ్రేడ్‌లు నిర్ణయించినపుడు ఏ గ్రేడ్‌ను ఏ గ్రేడ్‌లోకి మార్చారో చెప్పలేదు. గ్రేడ్-5 ఉద్యోగులు సెక్రటరీలు ప్రమోషన్ల మీద వెళ్లారు. ప్రస్తుతం ఉద్యోగుల్లో కూడా గందరగోళం ఉంది. ఏ ఉద్యోగిని ఎక్కడ ఎలా పనిచేయిస్తారో అనే విషయంలో కూడా గందరగోళం ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఈ ఉద్యోగులను సక్రమంగా వినియోగించుకోవడం రేషనలైజేషన్ చేయడంతోపాటు క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉద్యోగుల రేషనలైజేషన్ జరిగింది. కానీ క్లస్టర్ విధానాన్ని మ్యాపింగ్ చేశారే తప్ప, ఇంకా పూర్తిగా అమలులోకి తీసుకురాలేదు. జిల్లాలో 512 సచివాలయాలు ఉన్నాయి. వీటిని 218 క్లస్టర్లుగా విభజించారు. జిల్లాలో ప్రస్తుతం 4,278 ఉద్యోగులు పనిచేస్తున్నారు. చాలావరకూ ఖాళీలు ఉన్నాయి. ఎస్ పొజిషన్ అంటే పోస్టింగ్ ఇచ్చిన చోటనే పనిచేసేవారు 3280 ఉన్నారు. నో పొజిషన్ అంటే తాను పనిచేసే ప్రాంతంతోపాటు వేరేచోట కూడా పనిచేసేవారు 998 మంది ఉన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 96 సచివాలయాలు ఉన్నాయి. ఇక్కడ 950మంది ఉద్యోగులు ఉండాలి. ప్రస్తుతం 759 మంది ఉన్నారు. 201 ఖాళీలు ఉన్నాయి. ఇక్కడ క్లస్టర్ విధానం కొంతవరకూ అమలుచేస్తున్నారు. కానీ అది పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. రాజమహేంద్రవరంలో ఒకేభవనంలో ఎక్కువ సచివాలయాలు పెట్టడం వల్ల అవి ప్రజలకు అందుబాటులో కూడా లేవు. ఇది వైసీపీ నిర్వాకం. ఇక సచివాలయాలలో టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించారు. అధికారుల కథనం ప్రకారం వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, సర్వేయర్‌లో టెక్నికల్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాన్ టెక్నికల్‌గా ఉంటారు. ప్రస్తుతం అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రెండేసి సచివాలయాల్లో పని చేయవలసి ఉంది. పింఛన్ల పంపిణీ, మన మిత్ర సర్వే, కౌసల్య సర్వేలు ఈ ఉద్యోగులే చేస్తున్నారు. కొందరు బీఎల్‌వో డ్యూటీలు కూడా చేస్తున్నారు. వాస్తవానికి జాబ్‌చార్ట్ ప్రకారం పనిచేసే కొందరు ఉద్యోగుల వల్ల విజన్ యూనిట్‌గా మార్చవచ్చు. గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, వార్డుల్లో ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ప్రధాన వర్కు ఉంటుంది. శానిటేషన్, మహిళా పోలీసు, ఏఎన్ఎం చేయవలసిన పనులు కూడా చేయని పరిస్థితి. మహిళా పోలీసులు అంగన్‌వాడీలు, స్కూల్స్ తనిఖీ చేయాలి. ఆయా ప్రాంతాల్లో నేరాలు జరిగినా, బెల్ట్‌షాపులు, వంటివాటిపై నిఘా ఏఎన్‌ఎంలు చాలా చోట్ల ఆఫీసులకు రావడంలేదు. వాళ్ల ఫీల్డ్‌లో ఉన్నామని చెబుతుంటారు. కానీ శానిటేషన్ సెక్రటరీ ఆయా వార్డులలో శానిటేషన్ మీద కోసం పనిచేయాలి. పట్టణాల్లో శానిటేషన్ సూపర్‌వైజర్లు ఉంటారు. వారికి తోడు శానిటేషన్ సెక్రటరీ కూడా. వీరిని సక్రమంగా వినియోగించుకోవడం అవసరం. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రోడ్లు, భవనాలు వంటి వాటి గురించి చూడాలి. వీరందరినీ ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో వేరే పనులకోసం ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. కొన్నిచోట్ల మహిళా పోలీసులను బీఎల్‌వోలుగా ఉపయోగిస్తున్నారు. వీఆర్‌వోలు ఎక్కడ ఉంటున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి. సచివాలయంలో అడిగితే, తహశీల్దార్ కార్యాలయంలో ఉన్నారంటారు. అక్కడ అడిగితే ఇక్కడ అంటారు. సర్వేయర్లు పూర్తిస్థాయిలో పనిచేయడంలేదు. ఏఎన్ఎంలూ అంతే. ప్లానింగ్, మహిళా పోలీసు, వెల్ఫేర్లకు నిర్దిష్టమైన జాబ్ చార్టర్ కనిపించడం లేదు. అడ్మిన్‌లు మాత్రం టాక్స్ కలెక్టర్, సచివాలయ నిర్వహణ, లైన్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ చూస్తారు. ఈ సెక్రటరీలు నిత్యం ఫీల్డ్‌లోనే ఉన్నట్టు చెబుతున్నారు. ఇలా ఏదో పనికోసం ఫీల్డ్‌లో ఉన్నామని చెప్పడం వల్ల సచివాలయాల్లో ఎవరూ ఉండని పరిస్థితి ఉంది. గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు చాలా వరకూ సచివాలయాల్లో ఉంటారు. పింఛన్ల పంపిణీ రోజు ఎవరూ ఉండరు. మొత్తం మీద సచివాలయ ఉద్యోగులను వేర్వే పనులకే అధికారులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. విజన్ యూనిట్లుగా ఉండాలంటే ఆఫీసులో కొందరు ఉండాలి. గ్రామాలకు సంబంధించిన పనులన్నీ అక్కడ జరుగుతుండాలి. కలెక్టరేట్‌లోనూ, ఇతర డిపార్ట్‌మెంట్లలోనూ డిప్యుటేషన్ల మీద కూడా కొందరు పనిచేస్తున్నారు. ఉద్యోగులపై సరైన ఆజమాయిషీ లేదు. ఏదో పని గడిచిపోతుందనే విధానంలోనే అధికారులు వ్యవహరిస్తుండడంతో, ఉద్యోగులు కూడా అప్పగించిన పనిచేసి చేతులు దులుపుకుంటున్నారు.

డిజిటల్ అసిస్టెంట్లే ప్రధాన ఆధారం

గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ పాత్ర ప్రధానం. పంచాయతీ సెక్రటరీలకు సంబంధించిన బిల్లులు ఇతర వర్కు కూడా వీరే చేస్తుంటారు. ఇంటిపన్నులు, నీటిపన్నులు కట్టించుకోవడంతోపాటు ఈ-సేవ, మీ-సేవ పనులు వీరు చేస్తుంటారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు సంక్షేమ పథకాలు చూస్తారు. బీసీ, ఎస్సీ, కాపు, ఇతర కులాల రుణాలకు దరఖాస్తులు చూస్తుంటారు. ప్రజలకు దగ్గరగా పాలన ఉండాలనే ఈ ఉద్యోగుల సేవలను సక్రమంగా వినియోగించుకోవాలి. ఆయా గ్రామాలు, వార్డుల పరిధిలోని అని విషయాలను వారికి అప్పగించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రచారం, అవగాహన కల్పించడం వంటివి సక్రమంగా జరిగితే ప్రజలకు మేలే.

పింఛన్ల పంపిణీలో మంచి సేవ

సచివాలయ ఉద్యోగులు ప్రతీ నెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మంచి సేవే చేస్తున్నారు. ఉదయాన్ని ఆయా లబ్ధిదార్ల ఇళ్లకు వెళ్లి, పింఛన్లు పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ సర్వేలు కూడా ఈ ఉద్యోగులే చేస్తున్నారు. గ్రామస్థాయి సమాచారం వెంటనే రికార్డు కావడానికి ఈ ఉద్యోగులే కారణం. ఈ వ్యవస్థను విజన్ యూనిట్లుగా వినియోగించుకుంటే ప్రజలకు మరింత చేరువవుతుంది. మహిళా పోలీసులను అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయమన్నారు. కానీ వారికి సరైన అధికారం లేదు. రాజమండ్రిలో ఎస్పీ ఆఫీసులో పనిచేయడానికి, ఎగ్జామ్ సెంటర్ల డ్యూటీ, లీగల్ సర్వీస్ కమిటీ మీటింగ్ ప్రొటెక్షన్, ఐసీడీఎస్ మీటింగ్‌లకు వీరిని వినియోగిస్తున్నారు. కౌసల్యం సర్వే కింద గ్రామాల్లో విద్యావంతులు ఇంటి నుంచే పనిచేసే విధానం వస్తోంది. ఇందుకోసం డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నారు.



రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌లో గుండె వ్యాధుల స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

జీజీహెచ్‌లో గుండె సంబంధిత వ్యాధులపై స్ర్కీనింగ్ క్యాంపు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి(జీజీహెచ్)లో బుధవారం చిన్నారుల గుండె సంబంధిత వ్యాధులపై ప్రత్యేక స్ర్కీనింగ్ క్యాంపు నిర్వహించారు. మొత్తం 61 మంది పిల్లలకు స్ర్కీనింగ్ నిర్వహించారు. వీరిలో ఆరుగురికి అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమని తేలిందని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర తెలిపారు. మిగిలిన పిల్లలకు అవసరమైన మందులు తదుపరి వైద్యసలహాలు ఇండో బ్రిటీష్ హాస్పటల్ వారితో ఉచితంగా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ద్వారా గుర్తించిన గుండె సంబంధిత వ్యాధుల చిన్నారులకు విజయవాడ ఇండో బ్రిటీష్ హాస్పటల్ సహకారంతో స్ర్కీనింగ్ నిర్వహించామని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెడెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల గుండె సమస్యలను ప్రారంభదశలోనే గుర్తించి వైద్యసేవలందిస్తే భవిష్యత్తులో సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఐసీ వైద్యులు డాక్టర్ ఇంద్రజ, చిన్నపిల్లల గుండె నిపుణురాలు డాక్టర్ అనూష, వైద్యులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్య శిక్షణ

- నియోజకవర్గానికో స్కిల్‌హబ్
- మేధో మథనంలో కలెక్టర్ కీర్తి చేకూరి
- హాజరైన వీసీలు

రాజమహేంద్రవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు నైపుణ్య శిక్షణ ఉంటే భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకున్నట్టేనని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్రెయిన్ స్టార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగావకాశాల విస్తరణ దిశగా సమగ్ర చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా మేధో మథనం సమావేశాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అకాడమిక్ స్టడీతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కలిపి అమలు చేసినప్పుడే యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్‌హబ్ ఏర్పాటు జరుగుతోందన్నారు. వీటి ద్వారా నిరుద్యోగ యువకు శిక్షణ తరగతులు నిర్వహించి వారిలో నైపుణ్యాన్ని మెరుగుపరుస్తామన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు సాంకేతిక, భాష, అకౌంటింగ్, టూరిజం, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, నర్సరీ మేనేజ్‌మెంట్ వంటి విభిన్న అంశాల్లో తర్ఫీదు ఉంటుందన్నారు. ఆర్‌టీఐహెచ్ ద్వారా ఐదు జిల్లాల యువతకు స్టార్టప్స్ ద్వారా ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ 88 కంపెనీలతో ఎంవోయూలను కుదుర్చుకున్నామని కలెక్టర్ వివరించారు. యువతలో ఉన్న నైపుణ్య లేమిని గుర్తించి ఆ దిశగా శిక్షణ అందిస్తే స్థానికంగా మరిన్ని ఉద్యోగాకావకాశాలు కల్పించవచ్చన్నారు. సీఎస్ఆర్ విధానంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఆయా కార్పొరేట్ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే శిక్షణ పద్ధతులను ప్రారంభించామన్నారు. కొబ్బరి, పూలవ్యర్థాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన, మహిళా సాధికారత, కంప్యూటర్ అకౌంటింగ్, ఆంగ్లభాష సెంటర్ అభివృద్ధి, ఇండియన్ హెరిటేజ్ వంటి అంశాలను శిక్షణ జాబితాలో చేర్చామన్నారు. కళాశాల స్థాయిలో కూడా పలు అంశాలను ప్రవేశపెడితే విద్యార్థులు ఉపాధి సులభంగా పొందగలుగుతారని చెప్పారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నంనాయుడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, వీసీలు ప్రసన్న, మునిరత్నంనాయుడు

గోదావరి హారతికి ఏర్పాట్లు పూర్తి

• ఆర్డీవో సుస్మిత
• రేపు టీటీడీ ఆధ్వర్యంలో గోదావరిమాతకు మహానీరాజనం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గోష్పాదక్షేత్రంలో టీటీ డీ ఆధ్వర్యంలో గోదావరి హారతిని వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్నిచర్యలు చేపట్టినట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ఈనెల 14న కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం, దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న గోదావరిమాతకు అందించనున్న మహానీరాజనంకు సంబంధించి వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ మహానీరాజనంకు సంబంధించి 11 లైన్ డిపార్టుమెంట్‌లు పనిచేస్తున్నాయి. ఆలస్యంకాకుండా నిర్ణీత సమయానికి కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. గోదావరినదికి అందించే హారతిని తిలకించడం జన్మజన్మల సుకృతం అన్నారు. అధికసంఖ్యలో భక్తులు హాజరుకావాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను తీసుకువచ్చి హారతి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు సంకీర్తన, సాంస్కృతిక కార్యక్రమాలు, 5-30కు గోదావరిమాతకు పూజ, శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు మహాపూజ ప్రారంభం అవుతుంది. 6-58కు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకునికి హారతులు అందిస్తారు. 7గంటలకు గోదావరిమాతకు వివిధ రకాల హారతులతో మహానీరాజనం అందిస్తారని తెలిపారు. అనంతరం మంత్రపుష్పాలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు వేద ఆశీర్వచనాలు అందిస్తామన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం పురాణప్రసిద్ధి చెందిన ప్రాంతంలో గోదావరిమాతకు హారతి అందించడం పుణ్యఫలం అన్నారు. విశిష్ట హారతికి అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి.దేవకుమార్, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎలక్ట్రికల్ ఏడీ కృష్ణనాయక్, సీఐ కె.విజయబాబు, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంటరాజు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పశివేదల పాటిచెరువు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం ద్వారకా తిరుమల దేవస్థానం రథంలో తీసుకువచ్చిన ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణం జరిపించారు. పశివేదల సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు, పద్మావతి దంపతులు పీఠలపై కూర్చుని శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. గారపాటి శ్రీనివాసు, రాయపాటి సుబ్బారావు, సూదిన శ్రీనివాస్, పరిమి సోమరాజు, తాళ్లూరి సత్యనారాయణ, వేగిలింగేశ్వరరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఉండ్రాజవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షా కేంద్రాల్లో మౌలికసదుపాయాలకు కల్పించాలని అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కమిషనర్ ఎం.అమలకుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టెన్త్ పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించాలన్నారు. ప్రతిపాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇప్పటి నుంచే విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివేలా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఉండ్రాజవరం, వేలివెన్నులో పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవోలు సీహెచ్ సక్సేనారాజు, డి.శారదాజ్యోత్స్న, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కొవ్వూరు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జె.ఋషి, 10వ తరగతి చదువుతున్న కె.లోకేష్‌లు ఏలూరుజిల్లా గోపన్నపాలెంలో నిర్వహించిన అండర్-14, అండర్-17 కబడ్డీ జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, ప్రిన్సిపాల్ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు వాదాలకుంట విద్యార్థుల ఎంపిక

గోపాలపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఫుడ్‌బాల్ అండర్ 14,17ఫుడ్‌బాల్‌పోటీలకు బాలబాలికల విభాగంలో వాదాలకుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేక ర్లతో మాట్లాడుతూ ఇటీవల దేవరపల్లిలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు విజయ దుందుభీ మోగించారని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అండర్-14విభాగంలో చిత్తూరు జిల్లా పుంగనూరులో, అండర్-17 విభాగంలో పల్నా డుజిల్లా నర్సారావుపేటలో జరిగే ఫుట్‌బాల్ పో టీల్లో జిల్లా తరఫున తమ విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల కు ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఓంఫణి, ఉపాధ్యాయులు జగదీశ్, సురేశ్, గ్రామపెద్దలు అభినందించారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

• టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుత రామయ్య


టీడీపీ మండల కమిటీలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాబోయో ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా నూతన కమిటీల సభ్యులు కృషిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్రసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో బుధవారం తెలుగుదేశంపార్టీ పట్టణ, మండల, గ్రామ కమిటీలు, అనుబంధ సంఘాల సభ్యులతో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అచ్చిబాబు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కార్యకర్తలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి 15రోజులకు ఒకసారి నియోజకవర్గ కార్యాలయంలో అందుబాటులో ఉంటామన్నారు. నాయకులు, కార్యకర్తలు నేరుగా వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. నూతనంగా పదవులు పొందిన నాయకులు అందరికీ అందుబాటులో ఉంటూ మిత్రపక్షాలను కలుపుకుంటూ పార్టీని ముందుకు సాగాలన్నారు. మన పిల్లల భవిష్యత్ కోసం చంద్రబాబు దేశ, విదేశాలు తిరిగి పెట్టుబడులను ఆహ్వానిస్తూ పరిశ్రమలకు రాష్ట్రానికి తీసుకువస్తున్నారన్నారు. మన పిల్లలు దేశం విడిచి వెళ్లకుండా ఇక్కడే ఉపాధి కల్పించేందుకు కూటమి సర్కార్ కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ పదవులు పొందిన నాయకులు బాధ్యతతో పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్, యూట్యూబ్‌లలో పెట్టి ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. తెలుగుదేశంపార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్నారు. గ్రామాలలో ఏమైన చిన్ని చిన్న సమస్యలు ఉన్నట్లయితే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలన్నారు. రాబోయో స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలలో ఎన్డీఏ అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పట్టణ అధ్యక్షుడు అర్జిల్లి రామకృష్ణ, మండల అధ్యక్షుడు బేతిన నారాయణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సిద్ధన దుర్గాప్రసాద్, గారపాటి రామకృష్ణ, గొరిజాల సురేష్, కేవీకే రంగారావు, తుంపల్లి ఆదినారాయణ, మేకల శ్రీను, రాజా న శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో లబ్ధిదారులకు గృహమంజూరుపత్రాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, నల్లజర్లలో పెదపాటి వెంకమ్మకు ఇంటి తాళం నమూనా అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం

• నూతన గృహాల మంజూరులో లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ సొంత ఇళ్లు ఉండాలనే ఎన్టీఆర్ ఆశయాన్ని కూటమి ప్రభుత్వం నేరవేరుస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని 1వ వార్డు శ్రీరామకాలనీలో బుధవారం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన అర్బన్ పథకంలో మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారిలు యాదగిరి నూకరత్నం కుటుంబసభ్యులతో నూతనగృహంలో గృహప్రవేశం చేయించారు. అనంతరం నూతనంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం దూరదృష్టి వలన 16 నెలల్లో సుమారు 3లక్షల గృహాలు నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు తాళాలు అందించామన్నారు. సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. త్వరలోనే టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూరపనేని చిన్ని, బొండాడ సత్యనారాయణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, అర్జిల్లి రామకృష్ణ, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో గృహ ప్రవేశాలు

నల్లజర్ల(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడి సొంతింటికల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. నల్లజర్ల టీడీపీ కార్యాలయంవద్ద బుధవారం పోతవరం గ్రామానికి చెందిన లబ్ధిదారులు పెదపాటి వెంకమ్మకు ఇంటి తాళం నమూనా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సొంతిళ్లు లేని కుటుంబాలు ఎక్కువగా ఉన్నట్లు సర్వేద్వారా గుర్తించి అర్హులకు సాయం అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించుకున్నారన్నారు. గత వైసీపీ పాలనలో పక్కా ఇళ్ల నిర్మా ణాలు సక్రమంగా సాగలేదని, జగనన్న లే అవుట్‌లో ఇంటి నిర్మాణాల వరకే ప్రభుత్వం పరిమితమైందన్నారు. సొంత స్థలాలుండి ఇంటి నిర్మాణానికి వేలాది మంది వినతులు అందించినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులందరికీ ఇంటి రుణాలు ఇస్తుందని, సొంత స్థలం ఉన్న ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాయుడు, ఎంపీడీ వో సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ, మాజీ సర్పంచ్ యలమాటి శ్రీనివాసరావు, కూసంపూడి బుజ్జి, మర్ని దుర్గారావు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా రేఖా భాస్కరరావు



నిడదవోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణానికి చెందిన సీపీఐ నాయకులు రేఖా భాస్కరరావు తూర్పుగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గత 40 సంవత్సరాలుగా సీపీఐలోను, ఏఐటీయూసీలో ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తూ కార్మిక పోరాటాల్లోను కార్మిక సంఘాల నిర్మాణంలో తనదైన ముద్ర వేశారు. గత 15 సంవత్సరాలుగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్నారు. రేఖా భాస్కరరావు సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల పలు కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఆటో ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి


మృతుడు వెంకటరమణ

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరంరూరల్ పిడింగొయ్యి ప్రాంతానికి చెందిన దేవగుప్తాపు వెంకటరమణ (52) బుధవారం మరో వ్యక్తితో మోటారుసైకిల్‌పై పోలవరం వైపు వెళుతున్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంవద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమార్తె మానేపల్లి సాయిశ్రీ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. వెనుకకూర్చున వ్యక్తికి ఎటువంటి గాయాలు కాలేదు.

ఘనంగా పేటతుళ్ల గ్రామోత్సవం

తాళ్లపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడిలో శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప పీఠం ఏర్పాటుచేసి నిత్యం ఉదయం, సాయంత్రం పూజలు అభిషేకాలు, హోమాలతోపాటు బుధవారం పేటతుళ్ల గ్రామోత్సవంను పీఠం నిర్వాహకుడు ఎల్.వరప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటుచేశారు.

'కొవ్వూరును పర్యాటకంగా అభివృద్ధి చేయాలి'


కొవ్వూరు నియోజకవర్గ నాయకులను కలిసిన మంత్రి దుర్గేష్

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని కొవ్వూరు నియోజకవర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిలు కోరారు. బుధవారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు కుమారుడు సుభాష్ వివాహాన్ని పురస్కరించుకుని పర్యాటకశాఖ మంత్రికందుల దుర్గేష్ కొవ్వూరు విచ్చేశారు. పెళ్లికొడుకు సుభాష్‌ను ఆశీర్వదించారు. ఈసందర్భంగా ద్విసభ్య కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయో గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని కొవ్వూరును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు. మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, నాయకులు పాల్గొన్నారు.

చెరకులో పంటకోత ప్రయోగం


చెరుకు తూకం వేస్తున్న అధికారులు

గోపాలపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగంతో పంట దిగుబడిని సులభంగా అంచనా వేయవచ్చని మండల వ్యవసాయాధికారి ఏసుబాబు అన్నారు. గోపా లపురం గ్రామానికి చెందిన కుప్పాల శ్రీనివాస్‌రెడ్డి పొలంలో చెరుకుపంటకోత ప్రయోగాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకు గడలను తూకం వేశారు. అనంతరం వ్యవసాయాధికారి ఏసుబాబు మాట్లాడుతూ పంటకోత ప్రయోగం చేయడం ద్వారా రాష్ట్ర, దేశ ఆదాయ స్థితిగతులను అంచనా వేయవచ్చన్నారు. 2003 వీ46అనే పంట కోత ప్రయోగానికి ఎకరానికి 34టన్నులు దిగుమతి వస్తుందని మండల వ్యాప్తంగా వరికోతలో పంటకోత ప్రయోగాలు 48, చెరకు ఆరు, మినుము ఆరు ప్రయోగాలు చేశామ న్నారు. మండల గణాం కాధికారి జోడాల వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ఉపగణాం కాధికారి జయ భారతి, జానీ,రాజు, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజాఉద్యమం

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ ప్రజాఉద్యమం చేపట్టారు. బుధవారం కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ తలారి వెంకట్రా వు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి జూనియర్ కళాశాల, విజయవిహార్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో కెఆర్‌సీ తహసీల్దార్ పి.అచ్యుతకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మంజూరుచేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, గండ్రోతు సురేంద్ర, తోట రామకృష్ణ, కవల నాగేశ్వరరావు, దేవగుప్తాపు లక్ష్మణరావు, పరిమి సోమరాజు, చిట్టూరి అన్నవరం, ఏలూరి విజయలక్ష్మి, మూసా ఆనంద్, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జనసేన అండ

• నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు

నల్లజర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సహాయం కోసం అర్థించే ప్రతి బాధిత కుటుంబానికి జనసేన అండగా ఉంటుం దని గోపాలపురం నియోజకవర్గ జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. నల్లజర్ల మండలం ముసళ్ళకుంట గ్రామా నికి చెందిన శిరంగుల వెంకట సుబ్బారావు గత కొంతకాలంగా క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం ఆ కుటుంబాన్ని జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు దగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు తన అనుచరులతో కలిసి పరామర్శించి జనసైనికులు సమీకరించిన రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీ వింగ్ ఉన్నమట్ల సత్య, మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, చీపురుగూడెం పార్టీ అధ్యక్షుడు గుండాబత్తుల వరుణ్, దొండపాటి బాబు, తలంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు అహరోను ఎంపిక


విద్యార్థి కాకి అహరోనును అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నిడదవోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కాకి అహరోను జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ అంతుమేరి అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయస్థాయి అథ్లె టిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థి కాకి అహ రోను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ అంతుమేరి మాట్లాడుతూ ఈ నెల 8, 9 తేదీలలో శ్రీకాకుళంజిల్లా గోవిందపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో 400 మీటర్లలో కాంస్య పతకం, 600 మీటర్ల పరుగుపందెంలో రజిత పతకం కైవసం చేసుకున్నాడని తెలిపారు. డిసెంబరు 1నుంచి 4వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నిర్వహించే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొననున్నాడని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ పుష్పకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఉజ్జి కమలాకర్ పాల్గొన్నారు.

ఘనంగా లక్షపత్రి పూజ

దేవరపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రిపూజ బుధవారం కాపు సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజా కార్యక్రమాలు చేశారు. వేదపండితులు సీహెచ్ వీరేంద్రశర్మ, కుమారస్వామి శర్మ ఆధ్వర్యంలో లక్షపత్రిపూజ, సహస్ర దీపార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

• మంత్రి దుర్గేష్

నిడదవోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేకుండా ఏ పేదవాడు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతిఒక్కరికీ పక్కాఇళ్లు ఉండాలనే ధ్యేయంతో ప్రధానమంత్రి ఆవాస యోజన అర్బన్ పథకం 2.0 కింద నియోజకవర్గంలో ఇళ్లు మంజూరు చేశామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో గృహప్రవేశ, భూమి పూజ, గృహనిర్మాణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చిన 116 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ అనుమతి పత్రాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెరవలి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు తీపర్రు, ముక్కామల, పెరవలి గ్రంథాలయాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారులు జయలక్ష్మి , వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా 14న వారోత్సవాలు ప్రారంభ కార్యక్రమం, బాలల దినోత్సవం నిర్వహిస్తామని 15న పుస్తకప్రదర్శన, 16న ప్రముఖులచే వివిధ అంశాలపై ప్రసంగాలు, ప్రముఖులకు నివాళి, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధ పోటీల నిర్వహణ, 19న మహిళా దినోత్సవం, 20న అక్షరాస్యత దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

నల్లజర్ల(ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నల్లజర్లశాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తామని, ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు విచ్చేస్తున్నారని గ్రంథాలయ నిర్వాహకులు రమణ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యేను కలిసి వారోత్సవాల్లో జరిగే కార్యక్రమాలను వివరిం చారు. గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు ఆమె తెలిపారు.

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు దేవ రపల్లి శాఖ గ్రంథాలయంలో ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని దేవరపల్లిశాఖ గ్రంథాలయాధికారి వీ.సత్యనారాయణ తెలిపా రు. బుధవారం ఆయన విలేఖర్లతో మా ట్లా డుతూ 14వ తేదీ ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయని మనదేశ తొలిప్రధాన జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినోత్సవం సంద ర్భంగా బాలల దినోత్సవం జరుగుతుందని తెలిపారు.

'అధిక రేట్లు వసూలు చేయరాదు'

ఉండ్రాజవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరికోత యంత్రాల యజమానులు రైతుల నుంచి అధిక రేట్లు వసూలు చేయరాదని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. వరి కోతయంత్రాల యజమానులతో ఆయన మాట్లాడారు. తుఫాను వలన చేలు పడిపోవడంతో అసలు ధరకన్నా ఎక్కువ వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. తుఫాను వలన నేలవాలి వరి చేలతో నష్టం వాటిల్లి ఇబ్బందులు పడుతున్న తరుణంలో కోతయంత్రాల యజమానులు రైతులకు సహకరించాలని అన్నారు.